Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

Postal regd: GTR/115/2025-27

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు వార పత్రిక

అమరావతి సంపుటి (Vol) : 11 సంచిక (Issue) : 47 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 (Andhra Pradesh Capital's First Telugu Weekly)

గురువారం, 19 - 3 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI : APTEL/2015/66622 Postal regd: GTR/115/2025-27 స్థాపితం : 2015

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

## మిడిల్‌ఈస్ట్‌లో హింసకు స్వస్తి పలకండి : ఇరాన్ అధ్యక్షుడు మసౌద్‌తో మోదీ




**ఇంటర్నెట్ డెస్క్:** ఇరాన్ – ఇజ్రాయెల్, అమెరికా దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌కు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి ఫోన్ చేశారు. పశ్చిమాసియా దేశాల్లో యుద్ధ తీవ్రత పెరగడం, యుద్ధంలో సామాన్య ప్రజలు, పౌరుల ఆస్తులు ధ్వంసం కావడంపై మోదీ విచారం వ్యక్తం చేశారు. ఈ ఉద్రిక్తతల నడుమ ఇరువైపులా ఎవరూ వెనక్కి తగ్గని నేపథ్యంలో పరిస్థితులు విపరీత పరిణామాల వైపు దారి తీస్తుండటంపై మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా స్పందించారాయన. 'ఇరాన్ ప్రెసిడెంట్ డాక్టర్ మసౌద్ పెజెష్కియాన్‌తో ప్రాంతీయ పరిస్థితులపై చర్చించాను. అక్కడ ఉద్రిక్తతలు పెరగడం, పౌరుల ప్రాణనష్టం అలాగే పౌర మౌలిక సదుపాయాలకు నష్టం వాటిల్లడంపై ఆందోళన చెందాను. భారతీయ పౌరుల భద్రత, వస్తువులు, నిరంతర ఇంధన సరఫరా వంటివి భారత్ ప్రాధాన్య అంశాలుగా ఉన్నాయి. అంతేకాకుండా.. శాంతి, స్థిరత్వానికి దేశం నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ, సమస్యల పరిష్కారం కోసం చర్చలు, దౌత్యపరమైన జోక్యం అవసరమన్నాను' అని మోదీ ఎక్స్‌లో పేర్కొన్నారు.

## ఎన్నిక ఏదైనా మనమే గెలవాలి : సీఎం చంద్రబాబు




**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్‌లో మరో ఆరు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయని మంత్రులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఎన్నికలకు అందరూ సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఇప్పటివరకూ జరిగిన అన్ని ఎన్నికల్లో మనమే గెలిచామని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు. ఎన్నిక ఏదైనా మనమే గెలవాలంటూ మంత్రులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. శుక్రవారం నాడు రాజధాని అమరావతిలోని సచివాలయంలో సీఎం చంద్ర బాబు సారథ్యంలో కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రులకు ఆయన కీలక సూచనలతోపాటు దిశానిర్దేశం చేశారు. భూగర్భ నీటిమట్టం పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చంద్రబాబు వెల్లడించారు. అందుకోసం ఏప్రిల్ 1వ తేదీ నుంచి 90 రోజులపాటు జలధార కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. మే 15 నుంచి కాలువలకు నీరు విడుదల చేయాలని ఆదేశించారు. అందుకు రైతులను ముందస్తుగా సమాయత్తం చేయాలని మంత్రులకు సీఎం చంద్రబాబు సూచించారు. వెలుగొండ ఫేజ్–1 ఈ ఏడాది జూన్ నాటికి పూర్తి చేస్తామన్నారు. కృష్ణా నది కరకట్ట బలహీనంగా ఉన్న ప్రాంతాలను పటిష్ట పరచాలని ఆదేశించారు. మార్చి 16వ తేదీన అన్ని జిల్లాల్లో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమం కోసం మంత్రి సవిత ఆధ్వర్యంలో కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య భీకర పోరు సాగుతున్న వేళ.. ప్రజలు ఇబ్బంది పడకుండా కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం తెలిపారు. ఈ కమిటీలో మంత్రులు కేశవ్, అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్ ఉంటారన్నారు. గ్యాస్ లేని పక్షంలో ఇండక్షన్ స్టవ్‌లు కొంటున్నారని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ చెప్పారు. వివిధ శాఖల్లో మంత్రులు, ఉన్నతాధికారులపై కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్ ఏప్రిల్ 2వ తేదీన ఇస్తానని సీఎం చెప్పుకొచ్చారు. ఈ నివేదిక ఆధారంగా 2026–2027 ఏడాదిలో పని తీరు మెరుగుపరచుకోవాల్సి ఉంటుందని మంత్రులకు సీఎం చంద్ర బాబు సూచించారు. ఈ నివేదికలో లక్ష్యాలు సాధించడం, ఫైల్స్ క్లియరెన్స్, కేంద్ర నిధులు వినియోగం, పథకాల అమలు వంటి అంశాలు రహస్య నివేదికలో ఉంటాయని ఆయన వివరించారు.

## పలాసలో తొలి కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతం

**శ్రీకాకుళం, (రాజధాని వార్తలు):** జిల్లాలోని పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంట ర్‌లో నిర్వహించిన తొలి కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సను విజయవం తంగా నిర్వహించారు. యువతి హేమశ్రీకి వైద్యులు కిడ్నీ రీ ప్లాంటేషన్ చేశారు. ఈ శస్త్ర చికిత్స పూర్తయిన తర్వాత హేమశ్రీతో పాటు ఆమె తండ్రిని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పరామర్శిం చారు. అనంతరం ఎమ్మెల్యే శిరీష మాట్లాడుతూ.. చాలా కాలంగా ఉద్దానాన్ని కిడ్నీ భూతం ఇబ్బంది పెడుతుందని తెలిపారు. అలాంటిది ఈ రోజు.. శుక్రవారం పలాసలో కిడ్నీ మార్పిడి ఆపరేషన్ విజయవంతం కావడంతో తనకు చాలా సంతోషంగా ఉందన్నారు. మారుమూల ప్రాంతంలోని నిరుపేద యువతి కిడ్నీ సమస్యతో బాధపడుతుందని చెప్పారు. ఆమెకు ప్రముఖ వైద్యు లంతా వచ్చి ఈ శస్త్ర చికిత్స నిర్వహించారని చెప్పారు. ఉద్దానంలో కిడ్నీ సమస్యతో బాధపడుతున్న వారిందరికి ఈ వైద్యులంతా ఒక నమ్మకాన్ని కలిగించారని పేర్కొన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నందుకు కూటమి ప్రభుత్వానికి




ఎమ్మెల్యే శిరీష కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పలాసలో కిడ్నీ ఆసుపత్రి ఏర్పా టుకు సీఎం చంద్రబాబు నాయుడు సంకల్పం చెప్పారన్నారు. 2018లో వచ్చిన తుపాన్ సమయంలో సీఎం చంద్రబాబు పలాసలోనే 18 రోజుల పాటు ఉన్నారని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలో తుఫాన్ వచ్చిందని డొనేషన్లు ఇచ్చేందుకు ముందుకు వచ్చిన వారికి ఇక్కడ కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలని చెప్పారని ఎమ్మెల్యే గౌతు శిరీష వెల్లడించారు.

## కాకినాడ జిల్లాలో పెద్దపులి కలకలం.. శంఖవరం మండలంలో హై అలర్ట్!

**కాకినాడ, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్‌లో మరోసారి పెద్దపులి సంచారం ప్రజల్లో భయాందోళన రేపుతోంది. ముఖ్యంగా గోదావరి జిల్లాల పరిసర ప్రాంతాల్లో పెద్దపులి కదలిక ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. కాకినాడ జిల్లా శంఖవరం మండలంలో పెద్దపులి సంచరిస్తున్న విషయం తెలుసుకొని ప్రజలు భయంతో వణికిపోతున్నారు. మండల పరిధిలోని గౌరవంపేట పంచాయతీ, రాజవరం – మాసంపల్లి గ్రామాల మధ్య ఉన్న సరుగుడు తోటల్లో పెద్దపులి కదలికలను గుర్తించడంతో అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రస్తుతం ఈ పెద్దపులి మెడలో జీపీఎస్ రెడియో కాలర్ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీని సాయంతో పులి కదలికలను అటవీశాఖ సిబ్బంది ఎప్పటికప్పుడు ట్రాక్ చేస్తున్నారు. పరిస్థితిని నిశితంగా గమనిస్తున్న అధికారులు, పులిని సురక్షితంగా బంధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. పెద్దపులి ఎటువైపు వెళ్తోంది? ఎక్కడ ఆగుతోంది? అనే అంశాలను గమనించడానికి డ్రోన్లను, అత్యాధునిక కెమెరా ట్రాప్‌లను రంగంలోకి దించారు. పెద్దపులి సంచరిస్తున్న మార్గాల్లో ఇప్పటికే ఇనుప ట్రాక్ కేజ్‌లను (బోన్లను) అటవీశాఖ అధికారులు ఏర్పాటు చేశారు. పులిని పట్టుకునేందుకు భారీ ఆపరేషన్ నిర్వహించే అవకాం ఉంది. రాపిడ్ రెస్పాన్స్ టీమ్స్ రంగంలోకి దిగాయి. నాగార్జునసాగర్–శ్రీశైలం టైగర్ రిజర్వ్ నుంచి నిపుణులైన బృందాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన అవకాశం ఉంది. అవసరమైతే పశు వైద్యుల పర్యవేక్షణలో ట్రాంక్విలైజర్ గన్‌తో మత్తు మందు ఇచ్చి పులిని అదుపులోకి తీసుకోవాలని అధికారులు భావిస్తున్నారు. శంఖవరం మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు, ముఖ్యంగా తోటల్లో పనులు చేసేవారు, పశువుల కాపరులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు, ఒంటరిగా అటవీ ప్రాంతాలకు, తోటల్లోకి వెళ్లవద్దని హెచ్చరించారు.

## అమరావతిలో తెలుగు కల్చరల్ సెంటర్ నిర్మాణ పనులకు రూ.119.27 కోట్ల రూపాయలు మంజూరు

**అమరావతి, (రాజధాని వార్తలు):** తే. 13-03-2026 దీ శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో జరిగిన 1382వ (45వ) క్యాబినెట్ సమావేశంలో పలు అంశాలపై తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర సచివాలయం నాల్గవ భవనం ప్రచార విభాగంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్థసారధి మీడియాకు వివరించారు.

1. హోం శాఖ:

ఏపిఎస్‌పిలోని 2, 3, 5, 6, 9, 11, 14, 16వ బెటాలియన్లలో పనిచేస్తున్న ప్రస్తుతం 300 మంది హెడ్ కానిస్టేబుల్ పోస్టులను అసిస్టెంట్ రిజర్వ్ సబ్ ఇన్స్‌పెక్టర్లుగా స్థాయిని పెంచడానికి మంత్రి మండలి ఆమోదం తెలిపింది. దీనికి అనుగుణంగా అదే సంఖ్యలో హెడ్ కానిస్టేబుల్ పోస్టులు నియంత్రించడం జరుగుతుంది. మొత్తం 393 పోస్టుల అప్‌గ్రేడేషన్ కోసం ప్రతిపాదనలు రాగా, ఆర్థిక శాఖ 300 పోస్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పాత పద్ధతిలో ఒక ప్లాటూన్ కి కేవలం ఒకే ఒక్క ఏఆర్ఎస్ఐ ఉండేవారు. మిగతా సెక్షన్స్ అంతా హెడ్ కానిస్టేబుళ్ల ఆధీనంలో నడిచేవి. ఈ కొత్త మార్పుతో ఒక ప్లాటూన్‌కి ఏఆర్ఎస్ఐల సంఖ్య మూడుకు పెరుగుతుంది. దీనివల్ల లా అండ్ ఆర్డర్ సమస్యలు వచ్చినప్పుడు, వీఐపీల బందోబస్తులో, విపత్తుల సమయంలో కమాండ్ కంట్రోల్ మెరుగవ్వడమే కాకుండా స్థానిక పోలీసులతో సమన్వయం చేసుకోవడం చాలా సులువవుతుంది

2. పరిశ్రమలు & వాణిజ్యం:

పారిశ్రామిక ప్రాజెక్టులు సరైన సమయంలో అమలు జరగడానికి, పారిశ్రామికవేత్తలు బ్యాంకులు మరియు ఆర్థిక సంస్థల నుండి రుణ సహాయం సులభంగా పొందడానికి, రాష్ట్రంలో వ్యాపారం చేయడం మరింత సులువు చేయడానికి, పెట్టుబడులు వేగవంతం చేయడానికి మరియు ఉపాధి అవకాశాలు పెంచడానికి అవసరమైన చర్యలకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. పారిశ్రామిక అవసరాల కోసం ఏపీఐఐసీ కేటాయించిన దాదాపు 75,000 ఎకరాల భూములు రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22-A కింద 'నిషేధిత ఆస్తుల జాబితా' లోనే కొనసాగుతున్నాయి. దీనివల్ల ఈ భూముల్లో పరిశ్రమలు స్థాపిస్తున్న వారు తమ ఆస్తులను బ్యాంకుల్లో తాకట్టు పెట్టి రుణాలు పొందలేకపోతున్నారు. అలాగే, అధికారికంగా భూ కొనుగోలు లేదా లీజు ఒప్పందాలు చేసుకోవడానికి వీలు పడకపోవడంతో పాటు, పరిశ్రమల నిర్మాణం పూర్తయ్యాక కూడా యాజమాన్య హక్కులపై అనిశ్చితి నెలకొం




టోంది. ఈ సాంకేతిక ఇబ్బందుల వల్ల రాష్ట్రంలో ప్రాజెక్టుల నిర్మాణం బాగా ఆలస్యమై, పెట్టుబడులు రావడం, స్థానికులకు ఉద్యోగాలు దొరకడం కష్టంగా మారింది. ఈ సమ స్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు మంత్రి మండలి కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా, ఎలాంటి అభ్యంతరాలు లేని 66,157 ఎకరాల ఏపీఐఐసీ భూములను సెక్షన్ 22-A నిషేధిత జాబితా నుంచి తక్షణమే తొలగించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అలాగే, నిబంధనల ప్రకారం పరిశ్రమల నిర్మాణం పూర్తయిన తర్వాత మరో 3,803 ఎకరాలను కూడా షరతులతో ఈ జాబితా నుంచి తొలగించనున్నారు. వీటికి అదనంగా, సుమారు 51,603 ఎకరాల ప్రభుత్వ మరియు ఇతర భూములను నేరుగా ఏపీఐఐసీ పేరు మీదకు రెవెన్యూ రికార్డుల్లో మార్చేందుకు ఒకే సారి అనుమతి మంజూరు చేసింది. ఈ నిర్ణయంతో పారిశ్రామికవేత్తలకు లైన్ క్లియర్ అవ్వడమే కాకుండా, బ్యాంకుల్లో లోన్లు తెచ్చుకుని ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయడానికి వీలవుతుంది.

3. పరిశ్రమలు & వాణిజ్యం:

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ పేరిట ప్రతిపాదిత పథకానికి ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద దాదాపు 3,500 మంది మైక్రో ఎంటర్‌ప్రెన్యూర్లకు వారి తయారీ కార్యకలాపాలకు ఆర్థిక సహాయం అందించనున్నారు. దీనికి రూ.300 కోట్ల నిధులు కేటాయించారు. ఈ పథకం ద్వారా దాదాపు 17,000 మందికి ఉద్యోగాల కల్పన జరుగుతుందని అంచనా. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 175 ఎంఎస్ఎంఈ పార్కుల్లో సొంతంగా తయారీ పరిశ్రమలు పెట్టాలనుకునే వారి కోసం ప్రత్యేకంగా దీన్ని డిజైన్ చేశారు. రాబోయే నాలుగేళ్ల పాటు ఇది అమల్లో ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, వికలాంగులు, మహిళలు లాంటి ప్రత్యేక కేటగిరీల కింద వచ్చే వారికి ప్రాజెక్టు ఖర్చులో 25 నుంచి 35 శాతం వరకు మార్జిన్ మనీ సబ్సిడీని ప్రభుత్వం అందిస్తుంది. ఈ సబ్సిడీని నేరుగా కాకుండా మూడేళ్ల పాటు ఫిక్సుడ్ డిపాజిట్‌గా ఉంచి ఆ తర్వాత లోన్ అకౌంట్లో సర్దుబాటు చేస్తారు.

4. పురపాలక & పట్టణాభివృద్ధి:

అమరావతి ప్రభుత్వ కాంప్లెక్స్ పరిధిలో ఇంటిగ్రేటెడ్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ సెక్రటేరియట్ & HoD కార్యాలయాలు (జీఏడి టవర్, టవర్లు 3 & 4 మరియు టవర్లు 1 & 2)లో హై సైడ్ ఎలక్ట్రికల్, HVAC, ఫైర్ ప్రొటెక్షన్ సిస్టమ్, లిఫ్ట్‌లు, ఫైర్ అలారం & పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ మరియు ప్లంబింగ్ వర్కుల MEP పనులకు రూ.2,316.88 కోట్ల మొత్తానికి రాష్ట్ర మంత్రి మండలి పరిపాలన ఆమోదం తెలిపింది. 2019లో ఆగిపోయిన ఈ సచివాలయ నిర్మాణ పనులు జూన్ 2024లో ఐఐటీ మద్రాస్ మరియు ఇతర నిపుణుల కమిటీ ఇచ్చిన సేఫ్టీ రిపోర్ట్‌తో మళ్లీ మొదలయ్యాయి. ఇప్పుడు టవర్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతుండటంతో, ఎలక్ట్రికల్, ప్లంబింగ్, ఫైర్ సేఫ్టీ, ఏసీలాంటి పనులన్నీ (MEP పనులు) త్వరగా పూర్తి చేయాల్సి ఉంది. వీటిని 2025-26 మార్కెట్ రేట్లకు అనుగుణంగా డిజైన్ చేసి డిజైన్ అండ్ బిల్డ్ పద్ధతిలో కాంట్రాక్టు ఇచ్చేందుకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

5. పురపాలక & పట్టణాభివృద్ధి:

అమరావతిలోని నీరుకొండ (V)లో జూజ కాంట్రాక్ట్ పద్ధతిలో 'తెలుగు కల్చరల్ సెంటర్' నిర్మాణ పనులకు GST మరియు ఇతర నిబంధనలతో కలిపి రూ.119.27 కోట్ల మొత్తానికి రాష్ట్ర మంత్రి మండలి పరిపాలన ఆమోదం తెలిపింది. ఐదెకరాల స్థలంలో నిర్మించబోయే ఈ కేంద్రంలో 2000 మంది కూర్చునే భారీ గ్రాండ్ ఆడిటోరియం, 1000 మందికి సరిపడా ఓపెన్ ఎయిర్ థియేటర్‌తో పాటు తెలుగు భాషా మ్యూజియం కూడా రాబోతున్నాయి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలుగు కళలు, సాహిత్యం, సినిమా వైభవాన్ని చాటేలా దీన్ని ఒక అద్భుతమైన కల్చరల్ హబ్‌గా తీర్చిదిద్దనున్నారు. గ్రీన్ బిల్డింగ్ నిబంధనలకు అనుగుణంగా డిజైన్ చేసిన ఈ కేంద్రం ఏడాది పొడవునా పర్యాటకులను ఆకర్షిస్తుంది.

6. పురపాలక & పట్టణాభివృద్ధి:

CRDA ప్రాంతంలోని వివిధ సంస్థలకు భూమి కేటాయింపు సమీక్షకు సంబంధించిన మంత్రుల బృందం 24వ సమావేశం సిఫార్సులకు ఆమోదం తెలిపింది. అయితే, APIICకు సంబంధించిన భూమి కేటాయింపు ప్రతిపాదన మాత్రం దీని పరిధిలో లేదు. సీఆర్డీయే ప్రాంతంలో తాజాగా ఆమోదించిన భూకేటాయింపుల్లో సీబీఎస్ఈ రీజనల్ ఆఫీస్‌కు 0.8 ఎకరాలు, ఏపీ ఎస్ఐఆర్డీ అండ్ పీఆర్ ఎడ్యుకేషనల్ క్యాంపస్‌కు సుమారు 5 ఎకరాలు ఇచ్చారు. అంతేకాకుండా గతంలో నిడమర్రులో కిమ్స్, ఆదిత్య విద్యాసంస్థలకు కార్పొరేట్ హాస్పిటల్స్ కోసం ఇచ్చిన భూముల కేటాయింపుల్లో కొన్ని మార్పులు చేస్తూనే, తుళ్లూరు ఎడ్యుకేషనల్ సొసైటీకి రోడ్డు నిర్మాణంలో కోల్పోయిన స్థలానికి పరిహారంగా మరో 3 ఎకరాలు కేటాయించారు.

7. వ్యవసాయ & సహకార శాఖ:

ధాత్రి ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ అమలు నిమిత్తం గుర్తించిన ఎనిమిది జిల్లాల్లో FRA పట్టా హోల్డర్లకు 'Per Drop More Crop (PDMC)' పథకం కింద సేద్యపు నీటి సౌకర్యం కోసం డ్రిప్ ఇరిగేషన్‌పై 100% సబ్సిడీ, స్ప్రింక్లర్ ఇరిగేషన్‌పై 90% సబ్సిడీ సాచురేషన్ మోడ్‌లో విస్తరించడానికి ఆమోదం తెలిపింది. అటవీ హక్కుల పట్టా ఉన్న వాళ్ళు ఎస్టీ వర్గానికి చెందిన వారే అయినప్పటికీ, గతంలో వాళ్లకు స్ప్రింక్లర్ల మీద కేవలం 50 శాతం మాత్రమే సబ్సిడీ వచ్చేది. గిరిజన ప్రాంతాల్లో, వర్షాధార భూముల్లో పంటలు పండించడానికి ఈ సబ్సిడీ సరిపోవడం లేదు. అందుకే కేంద్ర ప్రభుత్వం తన వాటాను 54 శాతానికి పెంచడంతో, రాష్ట్ర వాటాతో కలిపి ఇకపై డ్రిప్ ఇరిగేషన్ పూర్తి ఉచితంగా (100%), అలాగే స్ప్రింక్లర్ సిస్టమ్ కోసం రైతులు కేవలం 10 శాతం డబ్బులు కడితే సరిపోయేలా (90% సబ్సిడీ) ఈ పథకాన్ని తీసుకొచ్చారు.

8. పర్యావరణం, అడవులు, సైన్స్ & టెక్నాలజీ:

కేంద్ర ప్రభుత్వం రూపొందించిన వాటర్ అమెండ్మెంట్ యాక్ట్, 2024ను అసెంబ్లీ మరియు కౌన్సిల్ రెండింటిలోనూ తీర్మానం ద్వారా ఆమోదించేందుకు ప్రతిపాదన పెట్టడానికి అనుమతి ఇచ్చింది. నీటి కాలుష్యానికి సంబంధించి పాత చట్టంలో చిన్నచిన్న తప్పులకు కూడా కఠినమైన జైలు శిక్షలు విధించే అవకాశం ఉండేది. కేంద్రం కొత్తగా చేసిన ఈ సవరణలో జైలు శిక్షలను తీసేసి వాటి స్థానంలో జరిమానాలను మాత్రమే చేర్చారు. ఈ కొత్త చట్టాన్ని మన రాష్ట్రం కూడా అధికారికంగా ఆమోదిస్తేనే కాలుష్యం ఎక్కువగా ఉన్న నగరాలకు 'నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్' కింద కేంద్రం నిధులు ఇస్తుంది. అలాగే పరిశ్రమలకు ఫీజుల భారం కూడా తగ్గుతుంది.

9.మహిళా శిశు అభివృద్ధి, వికలాంగుల సంక్షేమం & సీనియర్ సిటిజన్లు:

ఆంధ్రప్రదేశ్‌లో మిషన్ శక్తి కింద 'సఖి నివాస్ పథకం' (క్రెష్ సదుపాయంతో కూడిన వర్కింగ్

(మిగతా 8వ పేజీలో)

# రక్షణ తయారీ రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా తీర్చిదిద్దుతాం

**- రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ - జువ్వలదిన్నెలో సాగర్ డిఫెన్స్ ప్రాజెక్టుకు శంకుస్థాపన - ఈ బృహత్తర ప్రాజెక్టు ఏర్పాటుతో భారత స్వదేశీ రక్షణ తయారీ సామర్థ్యం బలోపేతమవుతుందని వ్యాఖ్య - మత్స్యకారులకు ఎల్లప్పుడూ ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని లోకేష్ భరోసా**









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** రాష్ట్రాన్ని రక్షణ తయారీ, సముద్ర సాంకేతిక రంగాల్లో దేశంలోనే ప్రముఖ కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. గురువారం నెల్లూరు జిల్లా బోగోలు మండలం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ సమీపంలో ఏర్పాటు చేయనున్న సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్ సంస్థకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ తమపై నమ్మకంతో ప్రపంచంలోనే గొప్ప పరిశ్రమను తమ రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిన కంపెనీ ప్రతినిధులను ప్రత్యేకంగా అభినందించారు. తన యువగళం పాదయాత్ర సమయంలో ప్రాంత మత్స్యకారులకు, వారి పిల్లలకు భవిష్యత్తుకు అండగా ఉంటామని హామీ ఇచ్చాను అని, ఆ హామీని నిలబెట్టుకుంటూ వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నట్లు చెప్పారు. దేశ రక్షణ రంగానికి అవసరమైన అత్యాధునిక సాంకేతిక పరికరాల తయారీలో ఈ సంస్థ కీలక పాత్ర పోషించనుందని మంత్రి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఆటోనమస్ మారిటైమ్ సిస్టమ్స్, అన్‌మ్యాన్డ్ సర్ఫేస్ వెసల్స్, ఆధునిక సముద్ర సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధి జరగనుందని తెలిపారు. ఈ కంపెనీతో తనకు ఒక బలమైన అనుబంధం ఉందని చెప్పారు. రాష్ట్రానికి వచ్చిన ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు, భారత స్వదేశీ రక్షణ తయారీ సామర్థ్యాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లడమే కాకుండా, సముద్ర సాంకేతికతలో వినూత్న ఆవిష్కరణలకు నాంది పలకనుంది. తీర ప్రాంత భద్రత మరియు పర్యవేక్షణను మరింత బలోపేతం చేస్తూ, మత్స్యకార రంగం మరియు పారిశ్రామిక నైపుణ్యాల అభివృద్ధికి ఈ కేంద్రం ఒక గొప్ప ఊతంగా నిలవనుందని లోకేష్ అన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు వెయ్యి మందికి పైగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించబడనున్నాయని మంత్రి వెల్లడించారు. రాష్ట్ర యువతకు అధునాతన సాంకేతిక రంగాల్లో ఉద్యోగ అవకాశాలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. భారత దేశం సువిశాలమైన సముద్ర తీర ప్రాంతాన్ని కలిగి ఉందని, అందులో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉందని మంత్రి చెప్పారు. సముద్ర తీర ప్రాంతాలను ఆధునిక పరిశ్రమల కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పంతో పనిచేస్తోందన్నారు. లక్షలాది కుటుంబాలు రాష్ట్రంలో సముద్ర తీరంపై ఆధారపడి జీవిస్తున్నాయని, అందుకనే గౌరవ ముఖ్యమంత్రి ఈ రంగాన్ని అభివృద్ధి చేయాలని ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఆక్వా రంగం, మత్స్యకార రంగాలను అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డ్రీమ్ ప్రాజెక్ట్ అని, దీని ద్వారా మత్స్యకారుల జీవన స్థితిగతులు మారనున్నట్లు చెప్పారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ఏర్పాటుతో 25 వేల మత్స్యకార కుటుంబాలకు ఉపాధి లభిస్తుందని, 1250 మేకనైజ్డ్ బోట్లు నిలుపుకునేలా, 41 వేల టన్నుల చేపల నిల్వ సామర్థ్యంతో ఈ ఫిషింగ్ హార్బర్ ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మత్స్యకారులకు ఈ ప్రజా ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని, ఇందులో ఎటువంటి సందేహం లేదని మంత్రి నారా లోకేష్ మత్స్యకారుల్లో భరోసా నింపారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ అభివృద్ధితో పాటు ఇలాంటి పరిశ్రమలు ఏర్పాటు కావడం ద్వారా తీర ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి పెద్దపీట పడుతుందని మంత్రి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో బ్లూ ఎకానమీ, సముద్ర పరిశ్రమలు మరియు ఆధునిక సాంకేతిక 5 రంగాలు మరింత బలోపేతం అవుతాయని తెలిపారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ అత్యాధునిక టెక్నాలజీతో ప్రపంచంలో అద్భుతమైన ఇండస్ట్రీని జువ్వలదిన్నెలో ఏర్పాటుచేయడం మనందరి అదృష్టంగా భావించాలన్నారు. నెల్లూరు జిల్లా జువ్వలదిన్నే వేదికగా ప్రపంచంలోనే మొట్టమొదటి సాగర్ డిఫెన్స్ అటానమస్ మారిటైమ్ షిప్‌బిల్డింగ్ సిస్టమ్స్ సెంటర్‌కు శంకుస్థాపన జరగడం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే గర్వకారణమన్నారు. ఇక్కడి డ్రోన్లను ఉపయోగించి సముద్రంలోని ఏ ప్రాంతంలో ఎక్కువ మత్స్యసంపద ఉందో కూడా తెలుసుకోవచ్చున్నారు. ఈ పరిశ్రమ మత్స్యకారుల కూడా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సుమారు వెయ్యిమందికి మరో రెండేళ్లలో ఈ ఇండస్ట్రీ ద్వారా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఉపాధి కోసం వలసలు వెళ్లనక్కరలేదని, మన సొంత ఊర్లోనే ఉద్యోగాలు చేసుకునే అవకాశం లభిస్తుందన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుతో అభివృద్ధి కొత్త పుంతలు తొక్కుతుందన్నారు. విజనరీ లీడర్ చంద్రబాబు, యువనేత నారా లోకేష్ కృషితో రాష్ట్రంలో యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని చెప్పారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ రక్షణరంగానికి సంబంధించిన పరిశ్రమను జువ్వలదిన్నెలో నెలకొల్పడం నెల్లూరుజిల్లాకు ఒక కానుక అన్నారు. ప్రపంచంలోని మొట్టమొదటిసారిగా భారత రక్షణ రంగం, సాగర్ డిఫెన్స్ కంపెనీ కలిసి రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ ప్రత్యేక కృషితో అతిపెద్ద పరిశ్రమను జువ్వలదిన్నె హర్బర్ కేంద్రంగా నెలకొల్పడం ఈ ప్రాంతవాసుల అదృష్టంగా చెప్పారు. అమరజీవి పొట్టి శ్రీరాములు మెమెరియల్ సెంటర్‌గా జువ్వలదిన్నెలో నారా లోకేష్ పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా ఉన్న సమయంలో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. మత్స్యకార గ్రామాలకు బ్రిడ్జిలు, రహదారులు, తుఫాను బిల్డింగ్‌లన్నీ కూడా నారా లోకేష్ హయాంలోనే నిర్మించినట్లు గుర్తుచేశారు. ఈ పరిశ్రమ ఏర్పాటు వలన మత్స్యకారులకు ఎంతో మేలు చేకూరుతుందని బీద రవిచంద్ర ఆశాభావం వ్యక్తం చేశారు. కావలి శాసనసభ్యులు దగ్గుమాటి వెంకృష్ణారెడ్డి మాట్లాడుతూ బ్రహ్మంగారి కాలజ్ఞానం మేరకు పెద్దఎత్తున పరిశ్రమల ఏర్పాటుతో కావలి కనకపట్టణంగా మారుతుందన్నారు. నారా లోకేష్ దూరదృష్టితో అనేక పరిశ్రమల ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ కేంద్రంగా మారుతుందన్నారు. అటు రామాయపట్నం పోర్టు సమీపంలో బీపీసీఎల్ ప్రాజెక్టు, ఇటు జువ్వలదిన్నె హర్బర్ కేంద్రంగా సాగర్ డిఫెన్సీ పరిశ్రమ, ఇంకా మరెన్నో నూతన పరిశ్రమలు కావలి సమీపంలో ఏర్పాటుకావడం ఈ ప్రాంత ప్రజల అదృష్టంగా చెప్పారు. ఇందుకు కృషిచేస్తున్న నారా లోకేష్‌కు కావలి ప్రజలు ఎప్పటికీ రుణపడి వుంటారన్నారు. మత్స్యకారులకు సేవ చేసే భాగ్యం తనకు లభించడం చాలా ఆనందంగా వుందన్నారు. జువ్వలదిన్నెలో ఫిషింగ్‌హార్బర్‌ను తాను నిర్మించానని, తన హయాంలోనే అనేక పరిశ్రమలు ఇక్కడ ఏర్పాటు కావడం మనసుకు సంతృప్తిగా ఉందన్నారు. ఈ పరిశ్రమ మత్స్యకారులకు భరోసాగా నిలుస్తుందని, దీనిని మనమంతా మనస్ఫూర్తిగా స్వాగతించి, సహకారం అందించాలన్నారు. ఇది ఒక పారిశ్రామికవాడగా అభివృద్ధి కానుందన్నారు. సాగర్ డిఫెన్స్‌లో కావలి పట్టణ యువతకు, సమీప గ్రామాల యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని నారా లోకేష్‌ను కోరారు. తొలుత నెల్లూరుజిల్లా బోగోలు మండలం కప్పరాళ్లతిప్ప వద్ద మంత్రి నారా లోకేష్‌కు నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే దగ్గుమాటి కృష్ణారెడ్డి, కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. మంత్రి నారా లోకేష్‌ను చూసేందుకు పెద్దఎత్తున విచ్చేసిన కార్యకర్తలు..అందరికి లోకేష్ అభివాదం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర, బల్లి కళ్యాణ్ చక్రవర్తి, ఎమ్మెల్యేలు దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, కాకర్ల సురేష్, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, సాగర్ డిఫెన్స్ కంపెనీ చైర్మన్ నికుంజ్, సీఈఓ ఆర్ కే బి సింగ్, సౌరబ్ పాటిల్, దయానంద్, సునీల్, ఏపీ మ్యారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ, సీఈవో అభిషేక్ కుమార్, పలువురు ప్రముఖులు, కంపెనీ ప్రతినిధులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

# నేటి నుంచి అనంత వేంకటేశ్వర స్వామి దేవాలయం ద్వితీయ వార్షికోత్సవాలు

**- రామానుజుల అన్నమాచార్య - 12 ఆల్వార్ల విగ్రహాలు ఏర్పాటు**







**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** శ్రీ అనంత వేం కటేశ్వర స్వామి దేవాలయం ద్వితీయ వార్షికోత్సవాలు గురువారం నుంచి ఈనెల 14 తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహిస్తు న్నట్లు ఆలయ ధర్మకర్తలు చిల్లా శ్రీనివాస్ రెడ్డి పివిఆర్ సురేష్‌లు తెలియజేశారు. గురువారం హోటల్ మేఘాలయ సమావేశ మంది రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వీరు మాట్లాడుతూ విజయనగరం జిల్లా గంట్యాడ మండలం, ఎగువ కొండపర్తి ప్రాంతంలో సముద్ర మట్టానికి 3333 అడుగులు ఎత్తున అనంతగిరి వైకుంఠ శిఖరంపై నిర్మించిన శ్రీ అనంత వేంకటేశ్వర స్వామి దేవాలయం నిర్మాణ వ్యవస్థాపక ధర్మకర్తలుగా కర్రి సముద్రారెడ్డి (సాగర్), శ్రీవిద్య దంపతులు వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఆగమ శిల్ప శాస్త్ర నిపుణులు చామర్తి బాలభాస్కరన్ స్థపతి 2022 ఏప్రిల్ 7న చామర్తి శ్రీధరాచార్య స్వామి ఆధ్వర్యంలో నిర్మాణ శంకుస్థాపన జరిగిందన్నారు. కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరుని దర్శన అనుభూతిని ఇచ్చేలా, తాటిపూడి జలాశయం పక్కన అనంతగిరి శిఖరంపై నిర్మాణమవుతున్న పుణ్యక్షేత్రం విశాఖ, అరకు మార్గంలో కాశీపట్నం నుంచి 36 మలుపులు, 18 కి.మీ ఘాట్ రోడ్ తిరుమల మార్గాన్ని గుర్తు చేసే విధంగా ఉంటుందన్నారు. దేవాలయానికి వచ్చే భక్తుల కోసం సదుపాయాలు కల్పించడానికి అర్చక నిలయం, ధర్మసత్రం, భోజనశాల, కేశఖండనశాల, ప్రసాదశాల, గోశాల, కళ్యాణమండపం, వీఐపీ కాటేజ్, గార్డెన్, పార్కింగ్ నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. దేవాలయ రెండవ వార్షికోత్సవాలు ఈ గురువారం నుంచి ఈనెల 14 శనివారం వరకు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమాలకు రాష్ట్ర మంత్రులు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఉన్నత అధికారులు హాజరవుతారన్నారు. ఈనెల 14న ఉదయం 9:06 గంటలకు ఉత్తరాషాఢ నక్షత్రయుత మేష లగ్నంలో ప్రధాన రాజగోపుర ప్రతిష్ట, పన్నిద్రాళ్వార్ రామానుజ విగ్రహ ఆవిష్కరణ జరుగుతుందన్నారు. గురువారం ఉదయం దేవాలయంలో వెంకటేశ్వర స్వామికి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, యాగశాల ప్రవేశం, అఖండ దీపస్థాపన, హోమాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. సాయంత్రం 5:45 కు అంకురార్పణ, జలాధివాసం, పవళింపుసేవ దైవిక పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 13 శుక్రవారం ఉదయం 6 కు 108 లీటర్ల పాలతో విశేష క్షీరాభిషేకం, వాస్తు పూజ, ధాన్యాధివాసం నిర్వహించడం జరుగుతుందన్నారు. సాయంత్రం 5:45 మండలారాధనలు, బలిహరణం పూజలు నిర్వహిస్తామన్నారు. 14న ఉదయం 6 గంటలకు గర్తన్యాసం, శాంతిహోమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటల ఆరు నిమిషాలకు రాజగోపుర కలశ యంత్ర ప్రతిష్ట, విగ్రహావిష్కరణ, పూర్ణాహుతి, చక్రస్నానం, ద్వారప్రవేశం. సాయంత్రం ఐదు గంటలకు వెంకటేశ్వర స్వామి శాంతి కళ్యాణం, ప్రముఖులకు సత్కారములు నిర్వహిస్తామన్నారు. వేదిక నాయకత్వంలో చామర్తి సత్య శ్రీధరాచార్య, శ్రీ దామర్తి శ్రీనివాసాచార్య ఆచార్యత్వం సారథ్యంలో 16 మంది వైష్ణవ వేదపండితులు పాంచరాత్రాగమ శాస్త్రప్రకారం త్రయాహ్నిక దీక్షతో పూజలు నిర్వహిస్తారని తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు ధవలేశు కుమార్, ప్రముఖ ఆర్టిస్ట్ వ్యాకరణం భరద్వాజ్, సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు ప్రత్యేక ఆహ్వానితులు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు సమన్వయకర్తగా వ్యవహరించారు. వెబ్‌సైట్: www.vykuntagiri.org, +91 7981748268 ఫోన్ నెంబర్కు సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు ఆలయ కమిటీ సభ్యులు వెంకటరమణ సురేష్, వెంకట్ రాజు, భరద్వాజ్, ధవలేష్ కుమార్ పాల్గొన్నారు.

# హైవేల వెంట వేసైడ్ అమెనిటీస్‌కు పెట్టుబడిదారుల ఆసక్తి

**- ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లిన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల - జిల్లా కలెక్టర్ ప్రతిపాదనకు అనుగుణంగా పశు భీమా యోజన పథకం నిధులు పెంపు**





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** జిల్లాలో రోడ్డు మరియు హైవే మార్గాల వెంట ప్రయాణికులకు అవసరమైన ఆధునిక సౌకర్యా లను కల్పించే వేసైడ్ అమెనిటీస్ ఏర్పాటుకు పెట్టుబడిదారుల నుంచి గణనీయమైన ఆసక్తి వ్యక్తమవుతోందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అన్నారు. గురువారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయం 5వ బ్లాక్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్వహించిన 6వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ రెండవ రోజు సమావేశంలో నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడు తూ.. జిల్లాలో వేసైడ్ అమెనిటీస్ ఏర్పాటు చేయడానికి పెట్టుబడి దారుల నుంచి గణనీయమైన ఆసక్తి వ్యక్తమవుతోందని తెలిపారు. రోడ్డు పక్కన, ముఖ్యంగా జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల వెంబడి ఈ వేసైడ్ సౌకర్యాల నిర్మాణానికి భూములను కొనుగోలు చేయాలని కొంతమంది పెట్టుబడిదారులు ముందుకు వస్తున్నారని, ఇప్పటికే కొన్ని అనుకూల స్థలాలను కూడా గుర్తించినట్లు ఆయన వివరించారు. ఈ ప్రాజెక్టుల్లో ప్రయాణికులకు సౌకర్యంగా ఫుడ్ కోర్టులు, పెట్రోల్ బంకులు, ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాలకు ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు ఉన్నాయని చెప్పారు. అదనంగా ప్రజలకు వినోదాన్ని అందించే విధంగా ఫన్ పార్క్ ఏర్పాటు చేయాలనే ఆలోచన కూడా ఉందని తెలిపారు.

అయితే ప్రస్తుతం ఈ ప్రాజెక్టుల్లో వసతి గదులు ఏర్పాటు చేసే ప్రణాళిక లేదని కలెక్టర్ తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ ప్రాజెక్టులను ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ ద్వారా ప్రాసెస్ చేయాలా, లేక ఆంధ్రప్రదేశ్ టూరిజం డిపార్ట్మెంట్ ద్వారా ప్రాసెస్ చేయాలా అన్న దానిపై కలెక్టర్ ముఖ్య మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే పశు భీమా యోజన పథకం కింద జిల్లాకు కేటాయించిన నిధులను రూ.11 లక్షల నుంచి రూ.30 లక్షలకు పెంచాలని జిల్లా కలెక్టర్ కోరగా, వెంటనే ముఖ్యమంత్రి ఆ ప్రతిపాదనను ఆమోదిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని సూచించారు.

# గృహ అవసరాల గ్యాస్ సరఫరాకు సంబంధించి వదంతులు నమ్మవద్దు

**- జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు**

**తిరుపతి, (రాజధాని వార్తలు):** ఇరాన్ ఇజ్రాయిల్ యుద్ధ ప్రభావం వలన గృహ అవసరాలకు సంబంధించిన గ్యాస్ నిల్వలు కొరత విషయం లో ఎలాంటి వదంతులు నమ్మవద్దని జిల్లాలో తగినంతగా గ్యాస్ నిల్వలు ఉన్నాయని జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు తెలి పారు.గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం నందు జిల్లాలోని గ్యాస్ ఏజెన్సీలతో గ్యాస్ నిల్వలపై జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఇరాన్ ఇజ్రాయిల్ యుద్ధ ప్రభావం వలన గృహ అవసరాలకు సంబంధించిన గ్యాస్ నిల్వలు కొరతకు ఎలాంటి వదంతులు నమ్మవద్దని తగినంతగా గ్యాస్ నిల్వలు ఉన్నాయని తెలిపారు. జిల్లాలో గ్యాస్ సరఫరా సజావుగా అందరికీ చేయడం జరుగుతుందని అన్నారు. గృహ అవసరాలకు గ్యాస్ సరఫరాలో ఎటువంటి అంతరాయం కలగకుండా చూడాలని గ్యాస్ ఏజెన్సీల యాజమాన్యాలను ఆదేశించారు. గృహ అవస రాలతో పాటు వసతి గృహాలకు తగినంత గ్యాస్ సరఫరా ఉం డేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శేషాచలం రాజు, డిప్యూటీ తాసిల్దారులు తదితరులు పాల్గొన్నారు.

# సంయుక్త కలెక్టర్‌ను సత్కరించిన మురళీమోహన్ రాజు






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు మరియు అఖిల భారత అవయవ, శరీర దాతల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం నెల్లూరు లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌నందు సావిత్రిబాయి పూలే వర్ధంతి, మహిళా దినోత్సవం సందర్భంగా అఖిల భారత అవయవ, శరీర దాతల సంఘం ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ కోఆర్డినేటర్, రచయిత కె.మురళీమోహన్ రాజు, విశ్రాంత ఉపకార్మిక కమీషనర్ డాక్టర్ రాచపాలెం రఘు ఆత్మీయంగా సంయుక్త కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లును ఆత్మీయంగా కలవడం జరిగింది.

ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లుకు ఆత్మీయ జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు.

# పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ నిధులు రూ.110.97 కోట్లు జమ

## - నిరంతరం కష్టపడే వ్యక్తి గిరిధర్ రెడ్డి : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** పీఎం కిసాన్ – అన్నదాత సుఖీభవ పథకాల ద్వారా నెల్లూరు జిల్లాలో 1,95,866 మంది రైతుల ఖాతాల్లో రూ.110.97 కోట్లు ప్రభుత్వం జమ చేసినట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. శుక్రవారం నెల్లూరు రూరల్ మండలం పొట్టెపాలెం గ్రామంలో నిర్వహించిన పీఎం కిసాన్ – అన్నదాత సుఖీభవ నిధుల విడుదల కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పీఎం కిసాన్ 22వ విడత కింద 1,63,125 మంది రైతులకు రూ.32.63 కోట్లు, అలాగే అన్నదాత సుఖీభవ మూడో విడత కింద 1,95,866 మంది రైతులకు రూ.78.35 కోట్లు విడుదల అవుతున్నట్లు చెప్పారు. ఈ రెండు పథకాల ద్వారా మొత్తం రూ.110.97 కోట్లు రైతుల ఖాతాల్లో జమ అవుతున్నట్లు వివరించారు. రైతుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పీఎం కిసాన్ – అన్నదాత సుఖీభవ పథకం రైతులకు ఆర్థిక భరోసాను కల్పిస్తోందన్నారు. రైతులకు అవసరమైన సమయంలో నిధులు అందించడం ఎంతో ముఖ్యమని, ప్రస్తుతం పంట కోతల సమయంలో ఈ డబ్బులు రైతులకు ఉపయోగపడతాయని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో ఈ ఏడాది రైతులు ఎంత ధాన్యం అందించినా ప్రభుత్వం మొత్తం కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉందని, ఈ మేరకు గౌరవ ముఖ్యమంత్రి భరోసా ఇచ్చినట్లు తెలిపారు. జిల్లాలోని సోమశిల, కండలేరు జలాశయాల్లో సుమారు 113 టీఎంసీల నీరు సమృద్ధిగా నిల్వ ఉన్నట్లు చెప్పారు. రాబోయే కాలంలో వర్షాలు తక్కువగా వచ్చినా కూడా రైతులకు ఇబ్బందులు కలగకుండా ముందుగానే నీటిని నిల్వ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం సోమశిల, కండలేరు జలాశయాలు, సాగునీటి ప్రాజెక్టులు, చెరువుల మరమ్మతులు చేపట్టడంతో రైతాంగానికి మేలు జరుగుతుందని వివరించారు. జిల్లాలో సుమారు 2,500 ఎకరాల్లో మైక్రో ఇరిగేషన్ ద్వారా పంటల సాగును ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేస్తూ రైతులకు ప్రయోజనం కల్పిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఐదు సెంట్ల పొలంలో ఫామ్ పాండ్ ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని, ఉద్యానవన పంటల సాగుకు మొక్కలను కూడా నరేగా ద్వారా అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. నిరంతరం కష్టపడే వ్యక్తి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి అని ప్రశంసించారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ...వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టారని అన్నారు. రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తోందని చెప్పారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ రంగంపై ప్రత్యేక అధ్యయనం కోసం ఒక ప్రత్యేక పాఠశాలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆలోచిస్తున్నట్లు తెలిపారు. నెల్లూరు జిల్లాలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి సారించి రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా "ఛాంపియన్ ఫార్మర్" కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఇది రైతు పక్షపాత ప్రభుత్వం అని, ప్రతి విషయంలోనూ రైతులకు మేలు కలిగేలా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అనంతరం పీఎం కిసాన్ – అన్నదాత సుఖీభవ పథకాల మెగా చెక్కులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి, ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్‌లో పిఎం-అభీమ్ యోజన కింద రూ.1118 కోట్లు మంజూరు

## - లోక్ సభలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ మిషన్ కింద కలిగిన లబ్ధి తెలియజేయాలని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి శుక్రవారం లోక్‌సభలో వివరాలు ఆరా తీశారు. ఆంధ్రప్రదేశ్ అంతటా, ముఖ్యంగా నెల్లూరు జిల్లాలో ఉన్న గ్రామీణ ఆరోగ్య, వెల్నెస్ కేంద్రాల వివరాలు, ప్రజారోగ్య యూనిట్ల జాబితా, ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ఆసుపత్రులు, క్రిటికల్ కేర్ హాస్పిటల్ బ్లాక్‌ల జాబితా వివరాలు కోరారు. ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ పోర్టల్ వ్యవస్థ విస్తరణకు సంబంధించి రాష్ట్రంలోని అన్ని వైద్య సంస్థలు దీని పరిధిలోకి వస్తాయా ఆరా తీశారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రశ్నలకు కేంద్ర ఆరోగ్యం కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ప్రతాప్ రావ్ జాదవ్ సమాధానం ఇచ్చారు. ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ మిషన్ (పిఎం-అభీమ్) అనేది కేంద్ర ప్రాయోజిత పథకం (సిఎస్ఎస్) అని, 2021-22 నుండి 2025-26 వరకు రూ. 64,180 కోట్లు కేటాయింపులు అయ్యాయన్నారు. ఆరోగ్య సేవల పంపిణీ, మరియు ఆరోగ్య పరిశోధనతో సహా ప్రజారోగ్య చర్యలను బలోపేతం చేయడానికి ఈ పథకం కొత్త తరం సంస్కరణలను అందిస్తుందన్నారు. PM-ABHIM యొక్క CSS భాగం కింద, రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన ప్రతిపాదన ప్రకారం, 696 భవనాలు లేని సబ్ హెల్త్ సెంటర్-ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు), 45 అర్బన్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు /ఆరోగ్య మరియు వెల్నెస్ సెంటర్లు, 26 ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ లాబొరేటరీలు మరియు 24 క్రిటికల్ కేర్ బ్లాక్‌లు నిర్మాణం/పునరుద్ధరణ కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఐదు సంవత్సరాల కాలానికి (2021-22 నుండి 2025-26 వరకు) రూ. 1118.80 కోట్ల మొత్తానికి పరిపాలనా అనుమతులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. 15వ ఆర్థిక సంఘం ఆరోగ్య నిధుల కింద, ఆంధ్రప్రదేశ్ అంతటా మొత్తం 436 బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్లు ప్రతిపాదించగా, వీటిలో 22 నెల్లూరు జిల్లాకు మంజూరు అయ్యాయన్నారు. రాష్ట్రంలోని అన్ని వైద్య సంస్థలు ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్లాట్‌ఫామ్ పరిధిలోకి వస్తాయని, ఇందులో 19 బోధనా ఆసుపత్రులు, 11 జిల్లా ఆసుపత్రులు, 54 ఏరియా ఆసుపత్రులు, 171 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 1162 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 558 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 14,999 గ్రామీణ మరియు పట్టణ ఆరోగ్య మరియు వెల్నెస్ కేంద్రాలు మరియు 1,778 ప్రైవేట్ సంస్థలు ఉన్నాయని వివరించారు.

# ఘనంగా సరస్వతి పూజ, వార్షికోత్సవం





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు రూరల్ మండలం పొట్టేపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు శుక్రవారం సరస్వతి పూజ మరియు వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇ.వినయ్ కుమార్ నిర్వహణలో ఉపాధ్యాయ బృందం సహకారంతో సరస్వతి పూజ ఘనంగా నిర్వహించారు అనంతరం జరిగిన వార్షికోత్సవంలో విద్యార్థులు పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు ఆరో తరగతి విద్యార్థిని ప్రదర్శించిన భరతనాట్యం అందరిని ఆకట్టుకుంది . ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వినయ్ కుమార్ మాట్లాడుతూ సోమవారం నుండి జరుగు పదవ తరగతి పరీక్షల లో పాఠశాల విద్యార్థులు బాగా రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు తద్వారా గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయం

## - ఇచ్చిన హామీ మేరకు రైతులకు 20 వేల పెట్టుబడి భరోసా - పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ మూడవ విడత నిధుల విడుదలతో రైతుల ముఖాల్లో సంతోషం : ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో రైతుల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం పీఎం కిసాన్ – అన్నదాత సుఖీభవ మూడవ విడత నిధుల విడుదల సందర్భంగా జిల్లా రైతుల తరపున ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఓ ప్రకటనలో ధన్యవాదాలు తెలియజేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారు, సీఎం చంద్రబాబు నాయుడు గారి సారథ్యంలో రైతులకు లబ్ధి చేకూరుతోందని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు 20 వేలు ఆర్థిక సహాయం చేయడం కూటమి ప్రభుత్వానికే సాధ్యం అన్నారు. రాష్ట్రంలోని 46.85 లక్షల మంది రైతుల ఖాతాల్లో 2675 కోట్లు జమ చేసి రైతు పక్షపాత ప్రభుత్వమని తెలియజేశారున్నారు. నెల్లూరు జిల్లా పరిధిలో 1 లక్ష 95 వేల మందికి 111 కోట్లు వారు బ్యాంక్ ఖాతాల్లోకి నేరుగా జమ కావడం వల్ల వ్యవసాయ కార్యకలాపాలకు అవసరమైన పెట్టుబడులను సమకూర్చుకునే అవకాశం కలిగిందని ఎంపీ పేర్కొన్నారు. రైతుల జీవితాల్లో సంతోషం, స్థిరత్వం తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. మూడవ విడత నిధుల విడుదలతో రైతులకు మరింత ఆర్థిక భరోసా లభిస్తుందని, రైతాంగం అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని చెప్పారు.

# సమస్యలు గుర్తించి అధికారులకు వినతి పత్రం అందించిన బాబు జగ్గజ్జీవనరావు బాలల పార్లమెంట్ సభ్యులు



**తాడేపల్లి, (రాజధాని వార్తలు):** గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ వారి చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో తాడేపల్లి మండలం ఉండవల్లి గ్రామంలో ఉన్న బాబు జగ్గజ్జీవనరావు బాలల పార్లమెంట్ సభ్యుల నెల వారి సమావేశం శుక్రవారం జరిగినది. ఈ సమావేశంలో సభ్యులు గ్రామంలో ఉన్న పిల్లలు ఎదుర్కొంటున్న ముఖ్యమైన 3 సమస్యలను గుర్తించారు. ఆ సమస్యల గురించి డి సౌందర్య మహిళా పోలీస్‌కి వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా గ్రామంలో వీధి కుక్కలు ఎక్కువగా ఉన్నాయని, మురుగు కాలువలు సరిగ్గా పూడిక తీయటం లేదని తీసిన చెత్త అక్కడక్కడ కుప్పలుగా పోసి అలానే వదిలేస్తున్నారని దానివల్ల దుర్వాసన వస్తుంది కాబట్టి తగు చర్యలు తీసుకోవాలని అలానే పిల్లలు సాయంత్రం పూట ఆడుకునే పబ్లిక్ పార్క్‌లో మద్యం సేవిస్తున్నారని, త్రాగిన తరువాత సీసాలు అక్కడే పగలు కోరుతున్నారని దీనివల్ల పిల్లలు ఆ పార్కులో ఆడుకోవటం చాలా కష్టంగా ఉంది అని దీనిపై తగిన నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే గ్రామంలో దోమలు విపరీతంగా ఉన్నందున కనీసం వారానికి ఒకసారి ఫాగింగ్ చేయాలని, మురుగు కాలువల పూడికను తొలగించి బ్లీచింగ్ చల్లించాలని వినతి పత్రం ద్వారా అభ్యర్థించారు. పిల్లలకు ఇలాంటి మంచి విషయాలు నేర్పించి సమాజం పట్ల బాధ్యత, గౌరవ భావాలు కలిగేలా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా వారిలో ధైర్యం, నాయకత్వ లక్షణాలు పెంపొందించడం గొప్ప విషయమని గ్రామ ప్రజలు గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ సేవలను అభినందించారు. ఈ విషయాన్ని సానిటరీ ఇన్‌స్పెక్టర్‌కి, స్థానిక పోలీస్ స్టేషన్‌కి పంచాయతీ కార్యదర్శికి కూడా తెలియజేస్తామని. తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడ్ షెఫర్డ్ సిబ్బంది అత్తోట పోతురాజు, డి.సౌందర్య మహిళా పోలీస్, బాబు జగ్గజ్జీవనరావు బాలల పార్లమెంట్ సభ్యులు పాల్గొన్నారు.

# ఆడపిల్లల ఆరోగ్యమే.. రేపటి ఆరోగ్యకరమైన సమాజానికి పునాది



**సూళ్లూరుపేట, (రాజధాని వార్తలు):** తిరుపతి జిల్లా, సూళ్లూరుపేట సామా జిక ఆరోగ్య కేంద్రంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'హెచ్‌పివి వ్యాక్సినేషన్' కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల, విజయశ్రీ పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే అరికట్టడానికి ఈ వ్యాక్సిన్ ఎంతో కీలకం. ఒక వైద్యురాలిగా, ఒక తల్లిగా నియోజకవర్గంలోని తల్లిదండ్రులందరికీ నా విజ్ఞప్తి...14-15 ఏళ్ల వయసున్న మీ ఆడపిల్లలకు తప్పనిసరిగా ఈ హెచ్‌పివి వ్యాక్సిన్ వేయించండి. క్యాన్సర్ మహమ్మారి నుండి వారి భవిష్యత్తును కాపాడండి. మన కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ ఇలాంటి కార్యక్రమాలను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంది. దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి అని

# సంపాదకీయం

## విదేశాంగ నీతిలో తప్పటడుగులు

'మేము నిటారుగా నిల్చుంటాం. ఎవరిముందూ తలవంచం. మా మిత్రులందరికీ స్నేహహస్తం అందుబాటులో ఉంటుంది. మా వ్యవహారాల్లో ఎవరి జోక్యాన్ని సహించం'. 1982లో నాటి భారత ప్రధాని ఇందిరా గాంధీ అమెరికా అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్య ఇది. భారత్‌ను అమెరికా శిబిరంలో చేరాలని ప్రెసిడెంట్ రీగన్ చేసిన ప్రతిపాదనకు ఇందిర నిష్కర్షగా చెప్పిన సమాధానం అది. ఆమె ఈ మాటల్ని ఎక్కడో అనలేదు. తన అమెరికా పర్యటనలో, సాక్షాత్తు రోనాల్డ్ రీగన్ సమక్షంలోనే అమెరికా, రష్యాల మధ్య సాగుతున్న ప్రచ్ఛన్న యుద్ధంలో-తాము ఎవరి పక్షమూ వహించబోమని, దౌత్యపరంగా తమది తటస్థ వైఖరి అని కుండ బద్దలు కొట్టినట్లు చెప్పారు ఇందిర. దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మొదలుకొని, అటల్ బిహారీ వాజపేయి వరకు, మధ్యలో దేశ ప్రధానులుగా కాంగ్రెస్ పార్టీ వారున్నా, కాంగ్రెసేతర పార్టీలకు చెందిన వారెవరున్నా.. భారతదేశ విదేశాంగ విధానం సుదృఢంగా అలీన విధానం (నాన్ అలైన్డ్) గానే కొనసాగింది. నిజానికి ఆనాటి భారత్ నేటి మాదిరిగానే ప్రబల ఆర్థికశక్తిగా లేదు. పేదరికం, అవిద్య, నిరుద్యోగం వంటి ఎన్నో సామాజిక, ఆర్థిక దుర్భతలతో దేశం సతమతమవుతోంది. అయినప్పటికీ అన్న వస్త్రాల కోసమో, అణ్వాయుధాల కోసమో భారత్ ఎవరిముందూ తల వంచలేదు. దేశాన్ని ఎవరు ఏలుతున్నా.. వారు ఏకపక్షంగా తమకు తోచినట్టుగా నిర్ణయాలు తీసుకోలేదు. సొంత పార్టీ నేతలను, దేశంలోని ప్రధాన రాజకీయ పార్టీల నేతలను కలుపుకుని అందరి సలహాలు, సూచనల మేరకు విదేశాంగ విధానాన్ని తీర్చిదిద్దారు. ప్రధానంగా దేశ ప్రయోజనాలు, మరీ ముఖ్యంగా ప్రపంచ మానవాళి శాంతి సౌభాగ్యాలకు దోహదం చేసే విదేశాంగ విధానాన్ని అనుసరించారు. కొన్ని సందర్భాలలో విదేశాంగనీతిలో రాజీపడవలసిన అనివార్యత ఏర్పడినా.. దేశ ప్రయోజనాల్ని ఎవరూ ఎన్నడూ పణంగా పెట్టలేదు. ఫలితంగానే నిన్నమొన్నటి వరకూ.. 'భారత' కీర్తి ప్రతిష్ఠల్ని అంతర్జాతీయంగా సమున్నత స్థాయికి తీసుకు వెళ్లగలిగారు. అయితే, ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో నడుస్తున్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వం గత కొన్నేళ్లుగా అనుసరిస్తున్న ఏకపక్ష విదేశాంగ విధానంతో అంతర్జాతీయంగా మన దేశ ప్రతిష్ఠ మసకబారింది. దేశ ప్రయోజనాలు దెబ్బతింటున్నాయి. భారతదేశం అనుసరించే విదేశాంగ విధానాన్ని ఒకప్పుడు వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి (స్ట్రాటజిక్ అటానమీ)గా చెప్పుకొనేవారు. దానివల్లనే దక్షిణాసియా దేశాలకు భారత్ ప్రాంతీయ నాయకత్వం వహించే స్థితికి చేరింది. కానీ, నేడు భారత విదేశాంగ విధానంలో స్పష్టత లోపించింది. ప్రత్యర్థి దేశాలకంటే వెనుకబడిపోయింది. అంతర్జాతీయంగా అనేక అవకాశాలు కోల్పోయింది. చివరకు-నేడు భారత్ ఎవరిపక్షం ఎందుకు వహిస్తున్నదో, దానివల్ల సాధిస్తున్న ప్రయోజనాలేమిటో చెప్పలేని పరిస్థితులు నెలకొన్నాయి. 'ఎలాంటి స్నేహితులు ఉండాలో ఎంచుకొనే అవకాశం మీకు ఉంది. కానీ పొరుగున ఎవరు ఉండాలో నిర్ణయించడం మీ చేతుల్లో ఉండదు' అనేవారు అటల్‌బిహారీ వాజపేయి. ఆ కారణంగానే ఒక్క పాకిస్థాన్ మినహా మిగతా పొరుగు దేశాలతో వాణిజ్య, దౌత్య, సాంస్కృతికపరంగా చక్కటి సంబంధాలు నెలకొల్పడానికి ఆయన ప్రాధాన్యం ఇచ్చారు. భారత్ తనకు మించిన స్థాయిలో నేపాల్, బంగ్లాదేశ్, అఫ్ఘానిస్థాన్, శ్రీలంక, మాల్దీవులకు అన్ని రకాలుగా సాయం చేసింది. అఫ్ఘానిస్థాన్, బంగ్లాదేశ్‌లను దాదాపుగా ఒంటిచేత్తో పునర్నిర్మాణం చేసింది. అఫ్ఘానిస్థాన్ పార్లమెంట్ భవనం నిర్మాణం మొదలుకొని రోడ్లు, బ్రిడ్జిలు, టెలిఫోన్ వ్యవస్థ వరకు అనేక రంగాలలో సాయం చేసింది. 1971-72లో తూర్పు పాకిస్థాన్ విముక్తమై బంగ్లాదేశ్‌గా అవతరించడానికి పాకిస్థాన్‌తో యుద్ధమే చేసిన భారత్.. ఆనాడు బంగ్లాదేశ్ శరణార్థులకు చోటిచ్చింది. వారి ఆకలి దప్పులు తీర్చడానికి దేశ ప్రజలపై అదనపు పన్నులు వేసింది. శ్రీలంకలో వేర్పాటువాదాన్ని అణచడానికి భారత్ తన సైన్యాన్నే (ఇండియన్ పీస్ కీపింగ్ ఫోర్స్-ఐపీకేఎఫ్) పంపింది. పొరుగు దేశాలైన మయన్మార్, మాల్దీవులకు సైతం సాయపడింది. కేంద్రంలో ఎవరు అధికారంలో ఉన్నా.. ఇదొక నిరంతర ప్రక్రియలా కొనసాగింది. నేడు 'నైబర్ హుడ్ ఫస్ట్' కాస్తా.. 'నైబర్ హుడ్ ఫర్‌గెట్'గా మారింది. భారత్‌ను ద్వేషించే దేశాలలో పాకిస్థాన్ సరసన బంగ్లాదేశ్ చేరిపోయింది. బంగ్లాదేశ్ పూర్తిగా చైనా చెప్పుచేతల్లోకి వెళ్లిపోయింది. హసీనా ప్రభుత్వ పతనం అనంతరం బంగ్లాదేశ్‌లో చైనా భారీగా పెట్టుబడులు పెట్టింది. మోంగ్లా ఓడరేవును, తీస్తా నదీ ముఖద్వారాన్ని చైనా అభివృద్ధి చేస్తోంది. నేపాల్, శ్రీలంక, మాల్దీవులతో సైతం భారత్ సంబంధాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఏదో సామెత చెప్పినట్లు.. సొమ్ము పోయి, శని పట్టడానికి కారణం-- మన దౌత్యనీతిలో వచ్చిన మార్పే! పొరుగు దేశాలతో పరస్పర సహకారం, గౌరవం ఇచ్చిపుచ్చుకుంటూ స్వప్రయోజనాలను కాపాడుకోవలసిన దౌత్య విధానంలో రాజకీయాలు జొరబడడం వల్ల.. సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. బంగ్లాదేశ్‌లో అవామీలీగ్ నేత షేక్ హసీనాతో అనుబంధం పెంచుకోవడం వల్ల అమెను వ్యతిరేకించే బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ చైనాకు దగ్గరయింది. అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ అధినేత తారిక్ రెహ్మాన్ చైనాకు తమ దేశపు తలుపులు బార్లా తెరిచాడు. అమెరికా విషయంలో కూడా ప్రధాని నరేంద్రమోదీ ఈ విధంగానే వ్యవహరించారు. ట్రంప్‌ను గెలిపించాలని ఆ దేశం వెళ్లి ఇండియన్ డయాస్పోరాకు పిలుపునిచ్చారు. పోనీ ట్రంప్ ఆ మేరకు నరేంద్రమోదీ పట్ల, భారత్ పట్ల కృతజ్ఞత చూపించాడా అంటే అదీ లేదు. భారత్‌పై ఏకపక్షంగా టారిఫ్‌లు భారీగా విధించాడు. రష్యా నుంచి ముడి చమురు కొనుగోలుపై ఆంక్షలు విధించాడు. ఇరాన్ నుంచి కూడా చమురు దిగుమతి చేసుకోరాదని అంతకుముందే హెచ్చరించాడు. పైగా, అమెరికా ఆంక్షలకు తలొగ్గిన ఫలితంగా.. భారత మార్కెట్లను అమెరికా వ్యవసాయ ఉత్పత్తులు ముంచెత్తబోతున్నాయి. దాంతో, భారత రైతాంగం పరిస్థితి ప్రశ్నార్థకం కావడం ఖాయం.

# వైసీపీలో జాలర్లకు గుర్తింపు

**- సౌత్ లీగల్ సెల్ ప్రెసిడెంట్గా చింతపల్లి లీలా కృష్ణ నియామకం - దక్షిణ వైఎస్ఆర్సిపిలోకి అడ్వకేట్ల చేరిక - వాసుపల్లికి కృతజ్ఞతలు తెలిపిన లీలా కృష్ణ**



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** వైయస్ఆర్సీపీలో జాలర్లకు సముచిత స్థానం కల్పించేలా కృషిచేసిన మాజీ ఎమ్మెల్యే దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ కి నూతనంగా నియమితులైన సౌత్ లీగల్ సెల్ ప్రెసిడెంట్ చింతపల్లి లీలా కృష్ణ ఆయనను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆసీలమెట్ట కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వాసుపల్లి సమక్షంలో 15 మంది న్యాయవాదులను వైయస్సార్సీపీలో చేరారు. జాలరి కమ్యూనిటీ నుండి రాష్ట్రస్థాయి నుండి నియోజకవర్గం వరకు అనేకమందికి సముచిత స్థానం కల్పించిన వాసుపల్లికి రుణపడి ఉంటామన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ ప్రజల పక్షాన న్యాయ పోరాటం చేస్తామని వారు తెలిపారు. లీలా కృష్ణ నియమితుల అవ్వడం పట్ల జాలరి కమ్యూనిటీ పెద్దలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ పార్టీలో చేరిన న్యాయవాదులకు అభినందనలు తెలియజేస్తూ జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకునే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. జగనన్న సేవలు మళ్లీ రాష్ట్రానికి అవసరమన్నారు. కూటమి ప్రభుత్వంలో అన్ని రంగాలు కుదేలయ్యాయని, ముఖ్యంగా పేదల సంక్షేమ అభివృద్ధి కుంటిపడిందన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు లేక, విద్య వైద్యాన్ని గాలికి వదిలేసారని దుయ్యబట్టారు. మత్స్యకారులు అంటే చంద్రబాబుకు మొదటి నుండి చిన్న చూపేనన్నారు. సముచిత స్థానం కల్పించిన వైఎస్ఆర్సిపి పార్టీని మరింత బలోపేతానికి జాలర్లు అంతా ఏకం కావాలని వాసుపల్లి గణేష్ కుమార్ పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన న్యాయవాదులు ఎం అరుణ్ కుమార్, కే. కృష్ణవేణి, ఆర్ చిరంజీవి, ఎస్ మనోహర్, వి జాక్, సత్యనారాయణ, బి శ్రీనివాస్, శ్రీను కాగా ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి రాష్ట్ర నాయకులు దశమంతుల చిన్ని, వార్డు అధ్యక్షుడు దశమంతల మాణిక్యాలరావు, జిల్లా నాయకులు నీలపు లక్ష్మి, మాదాబత్తుల రమేష్, వేణు, మాడుగుల నారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం జర్నలిస్టులకు రంజాన్ తోఫా

**- పండగ కానుకగా 20,000 అందించిన గంట్ల - ప్రత్యేక బహుమతులు పంపిణీ**



**విశాఖ: అక్కయ్యపాలెం, (రాజధాని వార్తలు):** రంజాన్ పర్వదినము సందర్భంగా నగరంలోని ముస్లిం జర్నలిస్టుల అసోసియేషన్ సభ్యులకు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు గంట్ల శ్రీనుబాబు రంజాన్ తోఫా అందజేశారు. ఈ మేరకు బుధవారం అక్కయ్యపాలెంలోని తన కార్యాలయంలో జర్నలిస్టులకు రంజాన్ పండుగ కానుకగా 20,000 నగదు అందజేశారు. అలాగే వీరికి ప్రత్యేక బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ ప్రతి ఏటా రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లిం జర్నలిస్టులకు గత 15 ఏళ్లుగా తన పరిధి మేరకు తోఫా అందజేస్తున్నట్లు చెప్పారు. అలాగే ఈ ఏడాది ప్రత్యేక బహుమతులు కూడా అందజేశామన్నారు. రంజాన్ పర్వదినం వేళ లోకమంతా సుభిక్షంగా ఉండాలని తాను కోరుకున్నట్లు చెప్పారు. జర్నలిస్టులకు నిరంతరం అండగా ఉంటానని తన పరిధి మేరకు వారికి ఎప్పటికప్పుడు సహాయం అందిస్తూనే ఉంటానన్నారు. నిరుపేద విద్యార్థులకు ప్రతి ఏటా విద్యా ప్రోత్సాహకాలు అలాగే వైద్యానికి సంబంధించి ఎంతో కొంత ఆర్థిక సహాయం తాను అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ముస్లిం జర్నలిస్టుల సంఘం ప్రతినిధులు మౌలానా, గయాజ్, ఇస్మాయిల్, సాదిక్, అహ్మద్ తదితరులంతా పాల్గొన్నారు.

# 96వ వార్డులో సుమారు రూ. 6.45 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు నగర మేయర్ శ్రీకారం





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖ నగర అభివృద్ధి ప్రాధాన్యతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం ఆయన పెందుర్తి జోన్ 96 వ వార్డు పరిధిలోని సుమారు రూ.491.27 లక్షలతో పబ్లిక్ వర్క్స్, సుమారు రూ.153.37 లక్షలతో తాగునీటి పైప్లైన్లు మార్పు పనులకు పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబుతో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం విశాఖ నగర అభివృద్ధికి, సంక్షేమానికి ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. పెందుర్తి పరిధిలో ఇప్పటికే ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడం జరిగిందని, నేడు సుమారు రూ.644.64 లక్షల వ్యయంతో శ్రీ వెంకటేశ్వర స్వామి టెంపుల్ వద్ద రిటర్నింగ్ వాల్ నిర్మాణంకు శంకుస్థాపన, జన చైతన్య లేఔట్ వద్ద తారు, సీసీ రోడ్డు ప్రారంభోత్సవం, దొగ్గవానిపాలెం ఓల్డ్ విలేజిలో సిసి రోడ్డు, కాలువలు ప్రారంభోత్సవం , పెందుర్తి బ్రిడ్జి నుండి గొర్లి వారి కల్లాల వరకు తారు రోడ్డు ప్రారంభోత్సవం, దొగ్గవానిపాలెం కాలనీలో సిసి రోడ్లు, కాలువలు ప్రారంభోత్సవాలు, ప్రసాద్ నగర్‌లో పార్క్ నిర్మాణం, దొగ్గవానిపాలెంలో కమ్యూనిటీ హల్ నిర్మాణం కోసం శంకుస్థాపన, గొర్లివారి కాలనీ ప్రాంతాలలో పైప్ లైన్ పనులు, హారిజాంటల్ డైరెక్షనల్ డ్రిల్లింగ్ పద్ధతిలో ప్రతిపాదిత 450 వీవీ వ్యాసం గల మీా కేసింగ్ పైపు, 250 వీవీ వ్యాసం గల క్యారియర్ పైపు ఏర్పాటు, పెందుర్తి జంక్షన్ నుండి రైల్వే గేట్ ప్రాంతం వరకు 250 వీవీ వ్యాసం గల హెచ్‌డిపిఇ పైప్‌లైన్‌ను ఏర్పాటు చేయుట, గోర్లివాని కాలనీలోని జనచైతన్య లేఅవుట్ నుండి ఏకలవ్య కాలనీ వరకు పైప్‌లైన్లను ప్రారంభోత్సవం పెందుర్తి శాసనసభ్యులతో కలిసి చేసామన్నారు. అనంతరం పెందుర్తి శాసనసభ్యులు మాట్లాడుతూ విశాఖ నగర అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని, పెందుర్తి నియోజకవర్గంలోని అన్ని వార్డులను సమదృష్టితో నిధులు కేటాయించి అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అందించడంలో కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. పెందుర్తి పరిధిలోని 96 వ వార్డులో సుమారు 6.45 కోట్ల రూపాయల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసామని, శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన కాంట్రాక్టర్లు నిర్ణీత సమయంలో పనులు పూర్తిచేసి ప్రజలకు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి జోనల్ కమిషనర్ హెచ్. శంకర్రావు, జీవీఎంసీ కార్యనిర్వాహక ఇంజనీరు దిలీప్, సంతోష్ కుమారి, ఉప కార్యనిర్వాహక ఇంజనీరు వీరయ్య, కార్యనిర్వహక ఇంజనీరులు రాజశేఖర్, శివలతోపాటు వేగి దివాకర్, వేగి పరమేశ్వరరావు, పి.రాజేంద్రప్రసాద్, కిల్లి రమేష్, సేనాపతి శేఖర్, పీలా జితేంద్ర, ఆళ్ల రమేష్, నాయుడు, శరగడం బుజ్జి, జీవీఎంసీ ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మధురవాడ జోన్ ప్రణాళిక విభాగంలో కొనసాగుతున్న ఏసీబీ తనిఖీలు

**విశాఖ: మధురవాడ, (రాజధాని వార్తలు):** విశాఖపట్నం నగరంలోని మధురవాడ జోన్ ప్రణాళిక విభాగంలో ఏసీబీ అధికా రులు చేపట్టిన తనిఖీలు కొనసాగుతున్నాయి. నిన్న నిర్వహించిన దాడుల్లో జప్తు చేసిన దస్త్రాల ఆధారంగా అధికారులు క్షేత్రస్థాయిలో కూడా పరిశీలనలు చేపడుతున్నారు. మధురవాడ ప్రాంతంలో ఉన్న అక్రమ నిర్మాణాలపై అధికారులు దృష్టి సారించి, వివిధ ప్రదేశాల్లో ఆమోదించిన ప్లాన్లు, కార్యాలయ దస్త్రాలు మరియు క్షేత్రస్థాయిలో ఉన్న నిర్మాణాలను పరస్పరం సరిపోల్చి పరిశీలిస్తున్నారు. ఈ తనిఖీలలో పలు నిర్మాణాలపై అనుమానాలు వ్యక్తమవడంతో అధికారులు మరింత లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అక్రమ నిర్మాణాలకు సంబంధించి పూర్తి వివరాలను సేకరిస్తూ, నిబంధనల ఉల్లంఘనలపై తగిన చర్యలు తీసుకునే దిశగా అధికారులు ముందుకు సాగుతున్నారు. ఇంకా కొన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# మాతృత్వం వెల కట్టలేనిది...!

**- "మన పెద్దాపురం టీమ్" కు అతిధుల అభినందనలు**



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** మాతృత్వానికి విలువ వెలకట్టలేమని కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) అన్నారు. బుధవారం పెద్దాపురం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో "మన పెద్దాపురం ఫేస్బుక్ టీం" వ్యవస్థాపక సభ్యుడు పేదిరెడ్డి నరేష్ అధ్యక్షతన నిర్వహించిన మాతృత్వం 100వ వారం కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మాతృత్వం పేరిట ఏర్పాటు చేసిన పౌష్టికాహారం కార్యక్రమం 100 వారాలు పూర్తి అయిన సందర్భంగా కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గర్భిణీ స్త్రీలకు శీమంతాలు, పౌష్టికాహార కిట్టుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తుమ్మల బాబు, తెదేపా జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్, వైసీపీ నియోజక వర్గ ఇంచార్జి దవులూరి దొరబాబు తదితరులు మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా ప్రతి బుధవారం ఆసుపత్రికి వచ్చే గర్భిణీ స్త్రీలకు మాతృత్వం పేరిట మధ్యాహ్న భోజన పథకం ఏర్పాటు చేయడం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. ఆసుపత్రికి చికిత్సకు వచ్చిన ప్రతి గర్భిణీ వారి సమయాన్ని బట్టి ఎక్కువ సమయం వేచి ఉండాలంటే వారి ఆరోగ్యానికి ఇబ్బంది కలుగుతుందనే ఆలోచనతో మన పెద్దాపురం ఫేస్బుక్ టీం సరికొత్త ఆలోచనతో ఆసుపత్రికి వచ్చిన గర్భిణులు ప్రతి ఒక్కరికి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసి వారి ఆకలి తీరుస్తున్నారని చెబుతూ వారి సేవలను అభినందించారు. మన పెద్దాపురం ఫేస్బుక్ టీం గత 14 సంవత్సరాల నుండి అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజల మద్దతు ప్రభుత్వం, రాజకీయ మద్దతుతో ప్రతి ఒక్కరు చేయూతగా ఉంటూ ఎన్నో కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, తద్వారా ప్రజల్లో చైతన్యం వచ్చి ప్రతి ఒక్కరు సేవాభావం కలిగి మన పెద్దాపురం పట్టణానికి పేరు తీసుకొస్తారని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా తెదేపా ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్, వైసిపి ఇన్చార్జి దవులూరి దొరబాబు, తెదేపా నాయకులు గుణం చంద్రమౌళిలు మాట్లాడారు. అనంతరం గర్భిణీ స్త్రీలకు శీమంతాలు నిర్వహించి వారికి పౌష్టిక ఆహార కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త మట్టే శ్రీనివాసరావు, వెంకటేశ్వర రైస్ మిల్ డైరెక్టర్ వల్లూరు సత్య శ్రీరామ్, పెద్దాపురం పట్టణ జనసేన అధ్యక్షులు పోలమర శెట్టి సత్తిబాబు, కౌన్సిలర్ ఓబులశెట్టి గణేష్, ఆసుపత్రి డైరెక్టర్ వంగలపూడి సతీష్, మన పెద్దాపురం ఫేస్బుక్ సభ్యులు లక్ష్మణ్ దివాకర్, కోరుకొండ ప్రశాంత్, జయశ్రీ, మార్ని చిన్న, దేవత రాజేష్, తెదేపా నాయకులు నూనె రామారావు, కె ఎస్ ఆర్ కె చౌదరి, కాజా రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# గాలికుంటు వ్యాధి శిబిరాలను విజయవంతం చేయాలి : జెడి డాక్టర్ శ్రీధర్ పిలుపు



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** ఈ నెల 16వ తేదీ నుంచి జరిగే పశువుల గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాలను విజయవంతం చేయాలని జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డా.వడ్డి శ్రీధర్, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ డిబిఆర్ అంబేద్కర్ పిలుపునిచ్చారు. పెద్దాపురం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పెద్దాపురం, కిర్లంపూడి మండలాల పరిధిలోని పశు వైద్యులకు, పారామెడికల్ సిబ్బందికి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. దీనిలో డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అంబేద్కర్, సహాయ సంచాలకులు డాక్టర్ తుమ్మల రామస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలాల్లో రైతులకు అందుతున్న పశు వైద్య సేవలు, ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై సమీక్షించి వైద్యులకు పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఈనెల 16వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పశువుల గాలికుంటు టీకాల శిబిరాల గోడ పత్రికలను అధికారులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రెండు మండలాల పరిధిలోని పశు వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

# సైన్స్ సెమినార్‌లో జ్ఞానీశ్వరికి ద్వితీయ స్థానం

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** జాతీయ సైన్స్ దినోత్సవ సందర్భంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన సైన్స్ సెమినార్‌లో స్థానిక పిఎం శ్రీ బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ అయోధ్య రామపురం విద్యార్థిని అక్కిన జ్ఞానీశ్వరి అత్యుత్తమ ప్రతిభ చూపి జిల్లా ద్వితీయ స్థానం సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోటకూర సాయి రామకృష్ణ అన్నారు. బుధవారం జిల్లాస్థాయి సైన్స్ పోటీలు కాకినాడ ఏపీఎస్పీ పాఠశాలలో నిర్వహించారు. సైన్స్ సెమినార్‌లో చక్కటి ప్రతిభ చూపిన పాఠశాల ఏడవ తరగతి విద్యార్థిని ఏ జ్ఞానీశ్వరిను జిల్లా విద్యాశాఖ అధికారి పి రమేష్, సైన్స్ అధికారి వినీల్ తదితరులు జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో గైడ్ టీచర్ ఎన్ హరనాథ్, ఏ చక్రధర్, యాదిద్య తదితరులు పాల్గొన్నారు.

# సెంచరీ విషయంలో షాక్ ఇచ్చిన నాగ్ అండ్ కో!



కింగ్ నాగార్జున 100వ చిత్రం తమిళ దర్శకుడు రా కార్తీక్ దర్శకత్వంలో రూపొందుతోన్న సంగతి తెలిసిందే. ల్యాండ్ మార్క్ చిత్ర కావడంతో నాగార్జున ఎలాంటి రిస్క్ తీసుకోకుండా సేఫ్ జోన్‌లోనే సినిమా చేస్తున్నట్లు అంతా భావిస్తున్నారు. ఇదొక క్లాసిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అని అంతా అనుకుంటున్నారు. కానీ రా కార్తిక్ ఇచ్చిన తాజా ట్విస్ట్‌తో మైండ్ బ్లాక్ అయింది. ఈషాక్‌తో ప్రేక్షకులే కాదు అక్కినేని అభిమానులు సైతం స్టన్ అవుతున్నారు. ఈ చిత్రం గురించి తొలుత బంగార్రాజు తరహాలో పల్లెటూరి నేపథ్యంలో సాగే కుటుంబ కథా చిత్రం అని ప్రచారం జరిగింది. నాగార్జున కూడా సాఫ్ట్ లుక్‌లో కనిపిస్తుండటంతో మరోసారి ఫ్యామిలీ ఆడియన్స్‌ను టార్గెట్ చేశారని అంతా అనుకున్నారు. కానీ ఈ సినిమా గురించి కార్తీక్ తాజాగా ఏమన్నాడంటే? ఇందులో కుటుంబ విలువలు ఉన్న మాట వాస్తవమే .కానీ ఇది పక్కా హై-వోల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ అని బాంబు పేల్చాడు. ఈ ట్విస్ట్‌తో ట్రేడ్ వర్గాలు కూడా విస్తుపోయాయి. సినిమాలో నాగార్జున పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉండబోతోందిట. ఒక సాదాసీదా కుటుంబ వ్యక్తి తన కుటుంబాన్ని కాపాడుకోవడానికి ఏ స్థాయికి వెళ్ళాడు అనే పాయింట్‌తో భారీ యాక్షన్ సీక్వెన్స్‌లను ప్లాన్ చేశారట.

సినిమాలో స్టంట్స్, ఫైట్ మాస్టర్స్ పనితనం హాలీవుడ్ ప్రమాణాలకు తగ్గట్టుగా ఉంటుందని, ముఖ్యంగా సెకండ్ హాఫ్‌లో వచ్చే యాక్షన్ బ్లాక్స్ నాగార్జున కెరీర్‌లోనే మునుపెన్నడూ చూడని విధంగా ఉంటాయని కార్తీక్ ధీమా వ్యక్తం చేశారు. ఈ యాక్షన్ ట్విస్ట్ వెనుక నాగార్జున ఆలోచన కూడా ఉన్నట్లు తెలుస్తోంది. వైల్డ్ డాగ్, ది ఘోస్ట్ వంటి చిత్రాలతో యాక్షన్ జోనర్‌లో ప్రయోగాలు చేసిన నాగ్ ఈసారి ఆ యాక్షన్‌కు బలమైన ఎమోషన్‌ను జోడించాలని కార్తీక్‌కు సూచించారట. కేవలం గన్‌లు, పేలుళ్లు మాత్రమే కాకుండా కథలో అంతర్లీనంగా సాగే ఉత్కంఠ ప్రేక్షకులను సీట్ల అంచున కూర్చోబెడుతుందని చిత్ర యూనిట్ అంటోంది. అందుకే ఇదొక ఎమోషనల్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్నట్లు విషయం బయటకు వచ్చింది. నాగార్జున సరికొత్త మేకోవర్‌తో ఆకట్టుకుంటారని తెలుస్తోంది. వెండి తెరపై నాగ్ చూపించే యాక్షన్ విన్యాసాలు ఒక స్వీట్ సర్ ప్రైజ్ కానున్నాయంటున్నారు.

దర్శకుడు ఇచ్చిన చిన్న క్లూతో అక్కినేని ఫ్యాన్స్‌లో అంచనాలు రెట్టింపు అవుతున్నాయి. ఇప్పటి వరకూ ఫ్యామిలీ సినిమా అని డీలా పడిన అభిమాను లంతా నాగ్ సర్ యాక్షన్ సినిమా చేస్తున్నారు? అనే సరికి ఉత్సాహం నిండుకుంది. ప్రస్తుతం సినిమా షూటింగ్ మైసూ ర్‌లో జరుగుతోన్న సంగతి తెలిసిందే. సినిమా స్టోరీ అక్కడ లోకేషన్లు డిమాండ్ చేయడంతో పాటు మైసూర్ నాగ్ సెంటిమెంట్ కావడంతో కీలక భాగమంతా మైసూర్‌లోనే షూట్ చేస్తున్నారు.

# అందుకే ఆయన డైరెక్టర్ వెర్షన్ ఆఫ్ పవన్ కళ్యాణ్!



డైరెక్టర్ హరీష్ శంకర్ పక్కా పవన్ కళ్యాణ్ ఫ్యాన్. అందులో ఎలాంటి సందేహం లేదు. తన అభిమాన హీరోను వెండి తెరపై ఎలా చూపించాలో? ఆయనకు తెలిసినంతగా మరెవరికీ తెలియదు. తొలి సినిమా గబ్బర్ సింగ్‌తోనే ప్రూవ్ చేసుకున్నాడు. ఆ తర్వాత హరీష్ శంకర్ ఫ్లాపుల్లో ఉన్నాపవన్ కళ్యాణ్ పిలిచి మరీఉస్తాద్ భగత్ సింగ్‌కి అవకాశం ఇచ్చారంటే హరీష్‌ని పవన్ ఎంతగా నమ్ముతారు అనడానికి ఇదొక మచ్చుతునక. త్వరలో రిలీజ్ అవుతోన్న ఈ సినిమాపై ఎలాంటి అంచనాలున్నాయో చెప్పాల్సిన పనిలేదు. అయితే ఫ్రీ లుక్ పోస్టర్‌లో హీరో వెనుక నుంచి తీసిన ఫోటోలో ఉన్నది పవన్ కళ్యాణ్ కాదు. హరీష్ శంకర్ అనే ప్రచారం జరిగింది. దీంతో హరీష్ శంకర్ డూప్‌గా నటించారే వార్తలు నెట్టింట వైరల్ అయ్యాయి. అయితే ఈ పోలిక పై హరీష్ తాను ఇవ్వాల్సిన వివరణ ఇచ్చేసినా పవన్‌తో పోల్చడం పట్ల చాలా సంతోషాన్ని వ్యక్తం చేసారు. దీన్నో ప్రశంసగా, పురస్కారంగా తీసుకున్నట్లు హరీష్ మాటల్లో కనిపిస్తుంది. తనను ఆరాధ్య దైవం పవన్ కళ్యాణ్‌తో పోల్చడం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఒక అభిమానిగా తన హీరోని పోలి ఉన్నాననే వార్త వినడం కంటే పెద్ద సంతోషం మరొకటి ఉండదన్నారు. ఆయనతో పోల్చడం నిజంగా గర్వంగా, సంతోషంగా అనిపించిందన్నారు. వ్యక్తిగతంగానూ హరీష్‌లో పవన్ మ్యానరిజమ్ కనిపిస్తుంది. ఆయన నడిచే తీరు, డ్రెస్సింగ్ స్టైల్ వంటివి హరీష్ సినిమాల్లో ప్రతిబింబిస్తుంటాయి. అందుకే అభిమానులు కూడా హరీష్ శంకర్‌ను డైరెక్టర్ వెర్షన్ ఆఫ పవన్ కళ్యాణ్‌గా పిలుస్తుంటారు. పవన్ కళ్యాణ్ తో సినిమా అంటే చాలామంది దర్శకులు ఒత్తిడికి గురవుతుంటారు. ఆయనతో ఫ్రీగా పని చేయగలమా? లేదా? అన్న టెన్షన్ చాలా మందిలో కనిపిస్తుంది. కానీ హరీష్ శంకర్‌లో మాత్రం అలాంటి భావన ఎక్కడా కనిపించదు.

పవన్ కళ్యాణ్‌తో ఎంతో స్వేచ్ఛగా సినిమా చేయగలరు. పవన్‌ని తన దారిలోకి తెచ్చుకుని పని చేయిం చుకోవడంలో స్పెషలిస్ట్. ఈ విషయంలో త్రివిక్రమ్ కంటే హరీష్ శంకర్ మరింత మెరుగ్గా పనిచేస్తారని చెప్పొచ్చు. అలాగని పవన్ స్వేచ్ఛకు భంగం కలిగించరు. పవన్ రాజకీయ హోదాను దృష్టిలో పెట్టుకుని ఉస్తాద్ భగత్ సింగ్‌లో ఎలాంటి ఐటం పాట పెట్టలేదు. నిజానికి సినిమాలో ఐటం పాట అవసరమే. కానీ హీరో గౌరవానికి భంగం కలగకూడదనే ఉద్దేశంతో ఆ ఛాన్స్ తీసుకోలేదు.

# మోనాలిసా పెళ్లిపై డైరెక్టర్ సంచలన పోస్ట్.. కుట్రపూరితం అంటూ వీడియో రిలీజ్





ప్రయాగరాజ్ మహా కుంభమేళాలో తన అమాయకపు చూపులతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన 18 ఏళ్ల మోనాలిసా భోంస్లే వివాహం ఇప్పుడు వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. తన ప్రియుడు ఫర్మాన్ ఖాన్‌ను పెళ్లాడిన మోనాలిసా, రక్షణ కోరుతూ పోలీసులను ఆశ్రయించిన సంగతి తెలిసిందే. అయితే, ఆమెను వెండితెరకు పరిచయం చేసిన దర్శకుడు సనోజ్ మిశ్రా తాజాగా స్పందిస్తూ.. ఇది కేవలం ప్రేమ వివాహం కాదని, దీని వెనుక పెద్ద కుట్ర ఉందని సంచలన వ్యాఖ్యలు చేయడం హాట్ టాపిక్‌గా మారింది. ఆ వివరాలు ఇలా వున్నాయి..

**డైరెక్టర్ ఆవేదన - 10 కోట్ల లోన్ మరియు జైలు ప్రస్థానం:**

మోనాలిసా పెళ్లిపై దర్శకుడు సనోజ్ మిశ్రా ఒక వీడియోను విడుదల చేస్తూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. “నేను ఆ అమ్మాయిని గంగామాత అవతారంగా భావించాను. ఆమెను స్టార్‌ను చేసే క్రమంలో ఏకంగా రూ.10 కోట్లు అప్పు చేశాను, ఆ విషయంలో జైలుకు కూడా వెళ్లాను. కానీ ఇప్పుడు ఆమె ఒక వ్యక్తితో పారిపోయి అంతా నాశనం చేసింది” అని పేర్కొన్నారు. తన తండ్రి పోలీస్ స్టేషన్ బయట కన్నీరు మున్నీరుగా విలపించినా ఆమె పట్టించుకోలేదని, ఆమెను ఎవరో తప్పుదోవ పట్టించారని ఆయన ఆరోపించారు.

**లవ్ జిహాద్ ఆరోపణలు - సౌత్ ఇండస్ట్రీ లింక్స్:**

ఇది సాధారణ ప్రేమ వివాహం కాదని, పక్కా పథకం ప్రకారం జరిగిన ‘లవ్ జిహాద్’ అని సనోజ్ మిశ్రా సంచలన ఆరోపణలు చేశారు. తన దగ్గర పని చేసిన ఒక వ్యక్తే ఆమెను ప్రలోభాలకు గురి చేసి, సౌత్ ఇండస్ట్రీలో అవకాశాలు ఇప్పిస్తానని నమ్మించి మోసం చేశారని ఆయన చెప్పుకొచ్చారు. ఇక మోనాలిసా తన కెరీర్‌ను, కుటుంబాన్ని వదిలేసి ఇలాంటి నిర్ణయం తీసుకోవడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. కుంభమేళా సెన్సేషన్‌గా మారిన మోనాలిసా భవిష్యత్తు ఇప్పుడు అంధకారంలో పడిపోయిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

**నెటిజన్ల చర్చ:**

మరోవైపు మోనాలిసా, ఫర్మాన్ ఖాన్‌ల పెళ్లి ఫోటోలు నెట్టింట విపరీతంగా వైరల్ అవుతున్నాయి. కేరళలోని తిరువనంతపురంలో పోలీసుల సమక్షంలో వీరిద్దరూ వివాహం చేసుకున్నట్లు సమాచారం. ఈ వివాదంపై నెటిజన్లు రెండు వర్గాలుగా చీలిపోయారు. కొందరు ఆమె వ్యక్తిగత స్వేచ్ఛను సమర్థిస్తుంటే, మరికొందరు ఆమెను పరిచయం చేసిన దర్శకుడి ఆవేదనలో నిజం ఉందేమో అని చర్చిస్తున్నారు. ఒక సామాన్య అమ్మాయి ఇంటర్నెట్ సెలబ్రిటీగా మారి, ఇప్పుడు ఇలాంటి వివాదంలో చిక్కుకోవడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

# అమ్మ కలకు ప్రతిరూపంగా సాయిపల్లవి!



సాయిపల్లవి కేవలం నటి మాత్రమే కాదు. వెండితెరపై నాట్యం చేసే ఓ కావ్యం. ఆమె డాన్స్‌లో ఉండే గ్రేస్, వేగం, ఎమోషన్ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తాయి. అయితే, సాయిపల్లవి ఇంత గొప్ప డాన్సర్ కావడానికి గల పునాది ఆమె ఇంట్లోనే పడింది. ఆమె తల్లి రాధామణి స్వయంగా గొప్ప నాట్య కళాకారిణి కావడమే సాయిపల్లవిలోని కళాకారిణి మేల్కొనడానికి ప్రధాన కారణంగా చెప్పొచ్చు. సాయిపల్లవి బాల్యం నుండే నాట్య వాతావరణంలో పెరిగారు. ఆమె తల్లికి నాట్యం పట్ల ఉన్న మక్కువ, సాధనను సాయిపల్లవి చిన్నప్పటి నుండి గమనిస్తూ వచ్చారు. తల్లి శిక్షణలో సాయిపల్లవి నాట్యంలోని మెళకువలను నేర్చుకోవడం వల్ల అమ్మడికి లయ, అభినయంపై చిన్న వయసులోనే పట్టు సంపాదించింది. ఒక రకంగా చెప్పాలంటే ఆమెకు నాట్యం అనేది వారసత్వంగా అందిన అపురూపమైన కానుక. చాలామంది డాన్సర్లు కేవలం స్టెప్పులను మాత్రమే అనుకరిస్తారు. కానీ సాయి పల్లవి ఆ స్టెప్పుల వెనుక ఉండే ఎమోషన్‌ను పండిస్తారు. దీనికి కారణం ఆమె తల్లి ఇచ్చిన సంస్కారవంతమైన శిక్షణే. శాస్త్రీయ నృత్యంలో ఉండే క్రమశిక్షణ, ముద్రలు కళ్ళతో పలికించే భావాలు ఆమె తల్లి ద్వారానే సాయిపల్లవికి అలవడ్డాయి. అందుకే సాయిపల్లవి వెస్ట్రన్ డాన్స్ చేసినా, ఫోక్ డాన్స్ చేసినా అందులో ఒక తెలియని క్లాసికల్ టచ్ కనిపిస్తుంది. సినిమాల్లో రాణించాలంటే కుటుంబ సభ్యుల ప్రోత్సాహం అంతే కీలకం. ఆ విషయంలో సాయి పల్లవికి మామ్ నుంచి తొలి నుంచి దక్కుతుంది. సాయిపల్లవి డాక్టర్ చదివినప్పటికీ, ఆమెలోని డాన్సర్‌ను నిరంతరం ప్రోత్సహించింది తల్లే. ఢీవంటి డ్యాన్స్ షోలలో పాల్గొన్నప్పుడు కూడా ఆమె వెన్నంటి ఉండి ధైర్యాన్ని ఇచ్చారు. తల్లి అభిరుచుని గుర్తించిన కుమార్తె చిత్ర పరిశ్రమలో ఎదగడానికి ఎంతో శ్రమించారు. తల్లి సాధించలేనిది తాను సాధించి ఆ విజయాన్ని తల్లికి బహుమతిగా ఇవ్వాలనుకున్నారు. ఆ రకంగా తల్లి పేరును సాయి పల్లవి నిలబెట్టిందని చెప్పొచ్చు.

ప్రతి సినిమాలోనూ తన డ్యాన్స్‌తో ఒక మ్యాజిక్ క్రియేట్ చేయడం సాయి పల్లవి ప్రత్యేకత. సాయిపల్లవి గొప్ప డాన్సర్ కావడంలో ఆమె కృషి ఎంత ఉందో ఆ కృషికి మార్గం చూపిన ఆమె తల్లి రాధా మణి పాత్ర అంతకుమించే. డాన్సర్‌గా ఎంత గొప్ప స్థానంలో ఉందో నటిగానూ అంతే సక్సెస్ అయింది. ఇప్పటికే దక్షిణాదిన అన్ని భాషల్లోనూ సినిమాలు చేసింది. ప్రతిష్టాత్మక చిత్రం రామాయణంతో బాలీవుడ్‌లోనూ అడుగు పెడుగు పెడుతుంది. ఇందులో సీతమ్మ పాత్రలో యావత్ భారతాన్ని అలరించనున్నారు.

# అక్షరాంధ్ర పరీక్షకు 99 శాతం హాజరయ్యేలా చూడాలి : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి



**విజయనగరం, (రాజధాని వార్తలు):** ఈ నెల 15న నిర్వహించే అక్షరాంధ్ర ఫైనల్ పరీక్షకు 99 శాతం హాజరయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి తెలిపారు. అలాగే హాజరైన వారంతా పాస్ కావాలని అన్నారు. శుక్రవారం కలెక్టర్ సంబంధిత అధికారులతో టి.సి ద్వారా పరీక్ష ఏర్పాట్ల పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1 లక్ష 10 వేల మందిని అక్షరాంధ్ర క్రింద గుర్తించామని, వీరందరూ అక్షరాస్యులుగా మారాలని తెలిపారు. డి.ఆర్.డి.ఏ, మెప్మా, డ్వామా, డి.ఈ.ఓ, ఐ.సి.డి.ఎస్ శాఖల అధికారులు వర్క్ పరిధిలోనున్న సిబ్బందితో పరీక్ష విజవంతం అయ్యేలా చూడాలన్నారు. పరీక్షా పత్రాల మూల్యాంకనం అనంతరం వారి మార్కులను యాప్ ద్వారా ఆన్లైన్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. సచివాలయంలో పని చేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్లు ఆదివారం పరీక్ష పూర్తి కాగానే సోమ, మంగళవారాల్లో వారికి వచ్చిన మార్కులను అప్లోడ్ చేయాలన్నారు. ఉపాధ్యాయులతో పాటు అవసరమైన చోట అంగన్వాడీ కార్యకర్తలను కూడా పరీక్ష నిర్వహణ బాధ్యత చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

**10వ తరగతిలో శత శాతం పాస్ కావాలి:**

ఈ ఏడాది 10 వ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులంతా పాస్ కావాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ల సదస్సు లో మన జిల్లా తరపున ముఖ్యమంత్రే శత శాతం ఫలితాలు సాధిస్తామని ప్రకటించారని, వారి నమ్మకాన్ని మనం నిజం చేయాలని, ప్రత్యేక అధికారులు విద్యార్థులను ఆ దిశగా సన్నద్ధం చేయాలని తెలిపారు.

# కవిరత్న మొల్లమాంబకు ఘన నివాళి

## - జాయింట్ కలెక్టర్ ఎస్.సేదు మాధవన్





**విజయనగరం, (రాజధాని వార్తలు):** కవిరత్న మొల్ల అసమాన ప్రజ్ఞావంతురాలని, ఆమె రచించిన రామాయణం నిత్య నూతనమని పలువురు వక్తలు కొనియాడారు. కవయిత్రి మొల్ల మాంబ జన్మదినోత్సవం సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్, డిఆర్ఓ సిహెచ్ సత్తిబాబు పాల్గొని మొల్ల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, మొల్ల మాంబ తెలుగు సాహిత్యానికి చేసిన సేవలను, ఆమె జీవిత చరిత్రను వివరించారు. చాలావరకు అచ్చతెలుగు పదాలతో గద్యరూపంలో సామాన్య ప్రజలకు అర్థం అయ్యేటట్టు ఆమె రామాయణాన్ని రచించారని చెప్పారు.

ఆమె గొప్పదనాన్ని గుర్తించిన ఆనాటి రాజులు మొల్ల మాంబకు కవిరత్న బిరుదును ఇచ్చి సత్కరించారని, ఆమె పాండిత్యం, అసమాన ప్రజ్ఞ నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా బి.సి సంక్షేమాధికారిణి జ్యోతిశ్రీ, సాంఘిక సంక్షేమశాఖ డిడి అన్నపూర్ణ, సహాయ బిసి సంక్షేమాధికారులు, వసతి గృహ సంక్షేమాధికారులు, కుమ్మరి, శాలివాహన సంఘ నాయకులు ఆర్.శ్రీనివాసరావు, కె.రమణ, బి.అప్పలస్వామి, అంబటి శ్రీనివాసరావు, ఎన్.రామారావు, ఎస్.వెంకట రమణమూర్తి, పి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

# ఉంగరాలు జుట్టు ఉన్న అందగత్తివే అనే జానపద సాంగ్‌ను లాంచ్ చేసిన సిరమ్మ






**విజయనగరం, (రాజధాని వార్తలు):** విజయనగరంలోని ధర్మపురి నందు సిరిసహస్ర నిలయంలో ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్ పర్సన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు మరియు భీమిలి నియోజకవర్గం సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) కుమార్తె చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మ శుక్రవారం నాడు జొన్నాడ క్రియేషన్స్ వారి ఫ్యాన్ ఇండియా ఆల్బమ్ (4 భాషల్లో) ఉంగరాలు జట్టు ఉన్న అందగత్తివే జానపద సాంగ్‌ను లాంచ్ చేసారు.

ఈ కార్యక్రమంలో కె.వి.సూర్య నారాయణరాజు (పులిరాజు), వర్రి నరసింహమూర్తి, రేగాన శ్రీని వాసరావు, చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షులు తోట వాసు, ఈ యూనిట్ సాంగ్‌లో నటించిన హీరో జొన్నాడ రమేష్, కొరియో గ్రఫీ చరణ్ మాస్టర్, సింగర్ & రైటర్ అనిల్ కుమార్, యూట్యూబ్ చానెల్ లక్ష్మణ్ (రేలారే రేలా) తదితరులు పాల్గొన్నారు.

# పొట్టి శ్రీరాములు జీవిత విశేషాలపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు




**విజయనగరం, (రాజధాని వార్తలు):** ఈ నెల 16వ తేదీన తెలుగు భాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు 125వ జయంతి ఉత్సవ వేడుకలు మోతీమహల్‌లో ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో మహారాజా అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం సాంబశివరావు ఆదేశాల మేరకు కళాశాలలో జరిగిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలుగు విభాగపు అధిపతి డాక్టర్ ఎన్ సూర్యకాంతి ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలలో విజేతలకు 16వ తేదీన బహుమతి ప్రదానం ఉంటుందని తెలుగు భాషా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సముద్రాల గురు ప్రసాద్ తెలిపారు. తెలుగు విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ పి శార్వాణి ,జి. విజయభాస్కరరావు, సిహెచ్ చేతి నాయుడు పోటీలను పర్యవేక్షించారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

## - రైతులు సుభిక్షంగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది
## - జిల్లాలో రూ. 71కోట్లు అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ నిధులు జమ : జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి





**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వ ధ్యేయమని, రైతులు సుభిక్షంగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. అందులో భాగంగానే 'అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్' పథకం కింద మూడవ విడత నిధులను ప్రభుత్వం విడుదల చేసిందని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సాయాన్ని కేవలం దైనందిన అవసరాలకే కాకుండా, వ్యవసాయ భూముల అభివృద్ధికి, పెట్టుబడికి వినియోగించుకోవాలని కోరారు.

పార్వతీపురం నియోజకవర్గ స్థాయి అన్నదాత సుఖీభవ నిధులు విడుదల కార్యక్రమం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బలిజిపేట మండలం వెంగాపురంలో శుక్ర వారం జరిగింది. ఈ కార్యక్రమానికి జేసీ ముఖ్య అతిథిగా పాల్గొని నిధులను రైతుల ఖాతాల్లోకి నేరుగా జమ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని సుమారు 1,22,000 మంది రైతులకు దాదాపు 71 కోట్ల రూపాయలను నేరుగా వారి ఖాతాల్లోకి జమ చేయడం జరిగిందని అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మూడు విడతల్లో కలిపి జిల్లా రైతులకు మొత్తం 210 కోట్ల రూపాయల నగదును ప్రభుత్వం అందజేసిన సంగతిని జేసీ గుర్తుచేశారు. సాగులో ఖర్చును తగ్గించి, దిగుబడి పెంచేందుకు డ్రోన్ల ద్వారా నానో యూరియా పిచికారీ వంటి ఆధునిక పద్ధతులను రైతులు అలవర్చుకోవాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా సాంకేతికత వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నారని గుర్తుచేశారు. 40-50 మంది రైతులు బృందాలుగా ఏర్పడి ఉమ్మడిగా పనులు చేసుకుంటే, ప్రభుత్వ రాయితీలను పొందడంతో పాటు దీర్ఘకాలికంగా ఆదాయం పెరుగుతుందని సూచించారు. అనంతరం పార్వతీపురం నియోజకవర్గ పరిధిలోని 25,807 మంది రైతులకు రూ. 14.99 కోట్ల నమూన చెక్కును రైతులకు జేసీ అందజేశారు. నియోజక వర్గ స్థాయిలో జరిగే ఈ కార్యక్రమం ద్వారా పాలకొండలో 33,107 మంది రైతుల ఖాతాల్లో రూ.19.24 కోట్లు, కురుపాం నియోజకవర్గంలోని 39,084 మంది రైతులకు రూ. 22.71 కోట్లు, సాలూరు నియోజకవర్గంలోని 24,262 మంది రైతుల ఖాతాల్లో రూ. 14.10 కోట్లు వెరసి జిల్లావ్యాప్తంగా 1,22,260 మంది రైతుల ఖాతాల్లో రూ.71.03 కోట్ల నిధులను జమ చేస్తున్నట్లు జేసీ వివరించారు. అనంతరం ఎల్పీజీ సిలిండర్ల సరఫరాపై మాట్లాడుతూ.. జిల్లాలో ఎల్పీజీ సిలిండర్ల కొరత లేదని, ఎవరూ వదంతులను నమ్మవద్దని జేసీ స్పష్టం చేశారు. విశాఖపట్నం నుండి నిత్యం సరఫరా జరుగుతోందని, అవసరమున్నప్పుడు మాత్రమే బుక్ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు జి.మురళి, వేణునాయుడు మాజీ ఎంపీపీ బి.రవి, మజ్జి అప్పారావు అరకు పార్లమెంటరీ అధ్యక్షులు, వ్యవసాయ శాఖ జెడీ సత్యవతి, సర్పంచ్ జి.అమ్మడమ్మ, ఇతర ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, పెద్దసంఖ్యలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పొదుపు, భీమా పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలి

## - పోస్ట్ ఆఫీస్ పథకాలు ప్రతి ఇంటికి చేరే విధంగా సిబ్బంది అహర్నిశలు కృషి చేయాలి - డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్ సంతోష్ నేత కైరంకొండ








**గజపతినగరం/ (విజయనగరం), (రాజధాని వార్తలు):** పోస్ట్ ఆఫీస్ పొదుపు, భీమాకు సంబంధించిన పోస్టల్ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకు వెళ్ళాలని ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్ డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్ (డి పి ఎస్) సంతోష్ నేత కైరంకొండ తపాలా శాఖ ఉద్యోగులకు సూచనలు చేశారు. విజ యనగరం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం నాడు సూపరింటెండెంట్ శ్రీనివాస్ అధ్యక్షతన ఈ ఆర్థిక సం వత్సరంలో డివిజన్ పరిధిలో చేసిన పొదుపు పథకాలపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్ట్ ఆఫీసు పథకాలు ప్రతి ఇంటికి చేరే విధంగా సిబ్బంది అహర్నిశలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా పొదుపు, భీమా విభాగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ఆయన బహుమతులు అందజేశారు. గజపతినగరం సబ్ డివిజన్ నుంచి ఇన్స్పెక్టర్ ఉపేంద్ర, నరవ, లోగిస, ఇప్పలవలస, కుంటినివలస, భూదేవిపేట, తుమ్మికాపల్లి, గరుగుబిల్లి బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌లు అవార్డులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో సహాయ సూపరింటెండెంట్ జి.వి.రమణారావు, సబ్ డివిజన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# హక్కులను ప్రశ్నించినప్పుడే వినియోగదారుడికి న్యాయం : జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ రెడ్డి





**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** వినియోగదారులు తమకు జరుగుతున్న అన్యాయంపై గళమెత్తినప్పుడే ఆశించిన న్యాయం లభిస్తుందని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా స్థానిక కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వినియోగదారులకు ప్రభుత్వం కల్పించిన హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కొనుగోలు చేసే ప్రతి వస్తువుపై నిర్దేశించిన బరువు, కాల పరిమితి మరియు ఎం.ఆర్.పి విలువలను తప్పనిసరిగా తనిఖీ చేయాలి. వస్తువు ధరలో అన్ని రకాల పన్నులు కలిపే ఎం.ఆర్.పిని నిర్ణయిస్తారని, అంతకంటే ఎక్కువ వసూలు చేయడం చట్టవిరుద్ధమని ఆయన స్పష్టం చేశారు. కొన్న ప్రతి వస్తువుకు రసీదు తీసుకోవడం వినియోగదారుడి ప్రాథమిక బాధ్యత అని, అది భవిష్యత్తులో ఏదైనా అన్యాయం జరిగితే ఫిర్యాదు చేయడానికి ప్రధాన ఆయుధంగా పనిచేస్తుందని తెలిపారు. ప్రస్తుతం సాంకేతికత అందుబాటులోకి వచ్చిందని, వినియోగదారులు తమ సమస్యలను ఆన్‌లైన్ ద్వారా లేదా ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా కూడా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి బి.అశోక్, డాక్టర్ జగన్మోహన్ రావు, లీగల్ అడ్వైజర్ టి. జోగా రావు వివిధ పాఠశాలల విద్యార్థులు మరియు సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థులకు వినియోగదారుల చట్టాలపై అవగాహన కల్పిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

# పల్లవించిన పదనిసలు - పరవళ్లు తొక్కిన పదనర్తనలు - కన్నుల పండుగగా సాంస్కృతికోత్సవం










**విజయనగరం, (రాజధాని వార్తలు):** ఉగాది సంబరాలు పేరిట విజయనగరం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో తెలుగు భాషా పరిరక్షణ సమితి, ఘంటసాల సంగీత సాంస్కృతిక సమాఖ్య, చిన్న శ్రీను సోల్జర్స్ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన సాంస్కృతికోత్సవంలో పదనిసలు పల్లవించాయి. పదనర్తనలు పరవళ్లు తొక్కాయి. చిన్నారుల నృత్య ప్రదర్శనలు కనువిందు చేసాయి. కళాకారుల గీతాలు వీనుల విందు గావించాయి. మొత్తంగా సాంస్కృతికోత్సవం పండుగ వాతావరణాన్ని ప్రతిబింబించింది. సమాఖ్య వ్యవస్థాపకులు సముద్రాల గురుప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చిన్న శ్రీను సోల్జర్స్ సంస్థ అధ్యక్షురాలు జ్యోతి ప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ నవ చైతన్యానికీ విశ్వసౌందర్యానికీ ప్రతీక ఉగాది. కొత్త ఆశల చిగుళ్లను ఆవిష్కరించే వసంతం ఉగాది. తెలుగువారి తొలి పండుగ ఉగాది. వసుధ మీదకు వసంతం వస్తోందని త్వరలో రానున్న ఉగాది విజయనగరం ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలని, అందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. సముద్రాల గురుప్రసాద్ మాట్లాడుతూ కాలం మార్పుల ప్రవాహమని, సుఖ దుఃఖాలూ, శుభాశుభాల నిరంతర పరంపర అని అన్నారు. వచ్చే మార్పులు ఎప్పటికప్పుడు నిత్య నూతనాలు, నవనవోన్మేషాలు అని సర్వమూ ఈశ్వర ప్రసాదమూ, భగవద్విలాసమూ అని భావించి నారాయణుని ఆస్వాదించే ఆత్మస్థైర్యాన్ని ఆ జగదీశ్వరుడు అందరికీ ప్రసాదించాలని అభిలషించారు. 2026 ఉగాదిని పురస్కరించుకుని నృత్య రంగంలో వరలక్ష్మీ త్యాగరాజ కళాశాలకు చెందిన గాయత్రి, అమృతవర్షిణి డాన్స్ స్కూల్‌కు చెందిన తెలికిచెర్ల సౌమ్య, లయ లాస్య డాన్స్ స్కూల్‌కు చెందిన బెల్లాన రాజు, విశ్వకర్మ డాన్స్ అకాడమీకి చెందిన ప్రవీణ్‌కుమార్ ఆచార్య, కుమారి హర్షితలకు, సేవారంగం నుండి ముళ్లపూడి సుభద్రాదేవి, డివి సత్యనారాయణ, డిమ్స్ రాజు, తాడేపల్లి నాగేశ్వరరావులకు, పాత్రికేయ రంగం నుండి కె జె శర్మ, మజ్జి శివకుమార్‌లకు, వెంట్రిలాక్విజమ్ నుండి శ్రీనివాస పండిట్, ఫోటోగ్రఫీ రంగం నుండి బుర్రా శ్రీనివాసరావులకు , కళారంగం నుండి గంటా లక్ష్మీలకు ఉగాది పురస్కారాలను సమాఖ్య అధ్యక్షులు గురుప్రసాద్‌తో కలసి చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర ప్రదానం చేసారు. కార్యక్రమానికి ముందుగా చిన్నారులు ప్రదర్శించిన నృత్యప్రదర్శనలు అందరినీ అలరించాయి. నృత్యం చేసిన చిన్నారులను విజయనగరంకు గర్వకారణంగా నిలిచిన వరలక్ష్మీ త్యాగరాజ నృత్యకళాశాల వ్యవస్థాపకురాలు లక్ష్మిరామదాసు ఆశీర్వదించారు.

# జిల్లాలో గ్యాస్ కొరత లేదు : జె సి యశ్వంత్ కుమార్ రెడ్డి తనిఖీల్లో వెల్లడి.. రూమర్లకు ఫుల్ స్టాప్



**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో గృహ వినియోగదారులకు గ్యాస్ కొరత లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా రాష్ట్రంలో వంట గ్యాస్ కొరత ఉందని సోషల్ మీడియోలో జరుగుతున్న ప్రచారం నమ్మొద్దని ప్రభుత్వం కోరింది. వినియోగదారుల అనవసర ఆందోళనల నేపథ్యంలో గ్యాస్ ఏజెన్సీలను తనిఖీ చేయాలని, సంబంధిత తాసిల్దారులకు, సబ్ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశామని దానిపై జిల్లాలో ఉన్న అన్ని గ్యాస్ ఏజెన్సీ తనిఖీ చేయడం జరిగిందని ఏ విధమైన కొరతలేదని జాయింట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు. ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించే వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామని తెలిపారు.ప్రభుత్వ సూచనలతో పార్వతీపురం మన్యం జిల్లాలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి జిల్లా పరిధిలో పలు ఏజెన్సీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలో వినియోగదారుల అవసరాలకు తగిన విధంగా ఎల్పీజీ గ్యాస్ నిల్వలు ఉన్నట్లు చెప్పారు. గ్యాస్ దొరకదనే అపనమ్మకంతో ఎవరూ ఆందోళన చెందవద్దని జేసీ కోరారు. జిల్లా పరిధిలో రోజువారీగా మూడు నుంచి నాలుగు వేల కలెక్షన్లు సరఫరా చేస్తున్నట్లు వివరించారు. ఇక రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉందని ప్రభుత్వం వెల్లడించింది. ఎక్కడ కృత్రిమ కొరత రాకుండా చర్యలు తీసుకుంటోంది తెలిపారు.

# ఉపాధి హామీ పరిరక్షణ యాత్రను జయప్రదం చేయండి : నియోజకవర్గ ఇన్చార్జ్ దుర్గాప్రసాద్

**గజపతినగరం, (రాజధాని వార్తలు):** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల ఈనెల 15వ తేదీన పారాదిలో జరిగే ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర సమావేశానికి హాజరవుతున్నారని గజపతినగరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ దుర్గాప్రసాద్ విలేకరులకు తెలియజేశారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షురాలు 15వ తేదీ ఉదయం 11 గంటలకు గజపతినగరం మీదుగా పారాది వెళుతున్నారని దుర్గాప్రసాద్ చెప్పారు. ఆదివారం వైయస్ షర్మిల ఉపాధి హామీ పరిరక్షణ యాత్రలో భాగంగా గజపతినగరంలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడతారని దుర్గాప్రసాద్ తెలియజేశారు. కావున నియోజకవర్గంలోని నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైయస్ షర్మిలకి స్వాగతం పలికే కార్యక్రమంలో పాల్గొనాలని నియోజకవర్గ ఇన్చార్జ్ దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు.



# అమర్ పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు

**విజయనగరం, (రాజధాని వార్తలు):** పట్టణంలో ధర్మపురి రోడ్డు వద్ద గల అమర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం వార్షికోత్సవ వేడుకలను పాఠశాల డైరెక్టర్ వి.ఇందుమతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు ఉదయం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల స్థాపించిన నాటి నుండి ప్రతి ఏటా వార్షికోత్సవ వేడుకలను విద్యార్థులు వారి తల్లిదండ్రుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. దీనివల్ల విద్యార్థులకు స్నేహభావం పెరుగుతుందన్నారు. విద్యార్థులకు అతి తక్కువ ఫీజులతో అత్యుత్తమ విద్యాబోధన అమర్ పాఠశాలలో అందిస్తున్నామన్నారు. ఇటువంటి కార్యక్రమానికి సహకరించిన విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. అనంతరం విద్యార్థులు పలు సంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ టి.రాంబాబు వైస్ ప్రిన్సిపాల్ ఏ.శారద తదితరులు పాల్గొన్నారు.



# లోక్ అదాలత్‌లో ఇచ్చే తీర్పు అంతిమ తీర్పు కక్షిదారులు ఉపయోగించుకోవాలి




**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాల మేరకు శనివారం రోజున జాతీయ లోక్ అదాలత్ శ్రీకాళహస్తి పట్టణంలోని కోర్ట్ ఆవరణలో 12వ అదనపు జిల్లా జడ్జ్ శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జ్ బేబీ రాణి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, జూనియర్ సివిల్ జడ్జ్ కృష్ణప్రియ, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ సాంబశివ, న్యాయవాదులు, శ్రీకాళహస్తి బార్ అసోసియేషన్ మెంబర్లు, అన్ని శాఖల ఉన్నత అధికారులు, కక్షిధారులు పాల్గొన్నారు. ముందుగా కోర్ట్ ఆవరణలో తిరుపతి, సంకల్ప హాస్పిటల్ వారు మెడికల్ క్యాంప్ నిర్వచించారు. దీన్ని న్యాయమూర్తులు ప్రారంభించి వైద్య పరీక్షలు చేసుకున్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ జరుగుతున్న జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేయాలని కోరారు, కక్షిదారులకు అవగాహన కల్పించి లోక్ అదాలత్ ద్వారా అప్పిలేని తీర్పును పొందవచ్చని అన్నారు. రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవడం వల్ల సమయము, ధనము ఆదా అవుతుందని, లోక్ అదాలత్ తీర్పు అంతిమ తీర్పు, దానికి అప్పిలు ఉండదని తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో అన్ని రకాల సివిల్ కేసులు రాజీ చేసుకోవచ్చు అని, రాజీకి లోబడిన క్రిమినల్ కేసులను రాజీ చేసుకోవచ్చని తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో ప్రీలిటికేషన్ కేసులు అనగా కోర్టులో పెండింగ్ లేని కేసులు రాజీ చేస్తారని కక్షదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, లోక్ అదాలత్ జయప్రదం చేయాలని కోరారు. ముఖ్యంగా అన్ని శాఖల ఉన్నతాధికారులకు లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చూపాలని తెలిపారు. కాగా శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో సుమారు 1937 కేసులు పరిష్కరించామని, సుమారు నగదు రూపంలో ఒక కోటి, ఒక లక్ష 73 వేల, 495 రూపాయలు వసూలు అయినట్లు జడ్జి తెలిపారు.

# ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని ఎలెక్సెంట్రా -2026 లో సీతం విద్యార్థుల ప్రతిభ



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఎలెక్సెంట్రా-2026లో భాగంగా నిర్వహించిన ప్రాజెక్ట్ ఎక్స్‌పోలో విజయనగరంలోని సీతం కళాశాల విద్యార్థులు రెండవ బహుమతి లభించింది. సీతంలో కళాశాలలో ఈసీఈ విభాగంలో రెండవ సంవత్సరం బి.టెక్ విద్యార్థులు ఎం.హైమ, ఎస్.తేజశ్రీవల్లి, పి.అఖిల్ మరియు మిస్టర్ కె.శ్రీనివాసరావులతో కూడిన బృందం “ఓపెన్‌సివిని ఉపయోగించి వర్చువల్ డాష్‌బోర్డ్” అనే వినూత్న ప్రాజెక్ట్‌ను రూపొందించారు. ఈ ప్రాజెక్ట్ 40 పోటీ నమూనాలలో రెండవ బహుమతికి ఎంపికైంది. ఇది విద్యార్థుల సాంకేతిక సృజనాత్మకత మరియు కంప్యూటర్ విజన్ టెక్నాలజీల ఆచరణాత్మక అనువర్తనాన్ని ప్రదర్శిస్తుంది. ఈ ప్రాజెక్ట్ యొక్క ప్రధాన ఉద్దేశం ప్రత్యక్ష సంబంధం లేకుండా పరికరాలను నియంత్రించడం. కంప్యూటర్ వెబ్ కెమెరా చేతి కదలికలను గుర్తించడానికి ఉపయోగించబడుతుంది, ఆపై సంబంధిత లోడ్లు పనిచేస్తాయి. ఈ ప్రాజెక్ట్ ప్రధానంగా ఏటీఎంస్ మరియు ఇండస్ట్రీస్‌కు వర్తిస్తుంది. ఆంధ్రా యూనివర్సిటీ మాజీ వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ శశి భూషణ్ సర్టిఫికెట్లు మరియు బహుమతులను అందజేశారు. విద్యార్థులు సాధించిన విజయాన్ని అభినందించారు మరియు వినూత్న పరిశోధన మరియు సాంకేతిక అభివృద్ధిని కొనసాగించమని వారిని ప్రోత్సహించారు. సీతం డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి వి రామమూర్తి, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ టి.దామోదర్ నాయుడు,ఇతర అధ్యాపకులు, ఇతర విద్యార్థులు విజేతలను అభినందించారు. మరియు వారి అంకితభావం మరియు జట్టు కృషిని అభినందించారు.

# పీ4 స్ఫూర్తితో బీసీ బాలికల వసతి గృహంలో ఉచిత ఇ.ఎన్.టీ వైద్య శిబిరం

**కావలి, (రాజధాని వార్తలు):** పట్టణంలో ఉన్న ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహంలో పీ4 స్ఫూర్తితో ఉచిత ఇ.ఎన్.టీ వైద్య శిబిరం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేపట్టిన పీ4 కార్యక్రమం ప్రేరణతో జరిగింది. కావలి పట్టణంలోని బాపూజీ నగర్‌లో ఉన్న ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహంలో సంయుక్త సేవా సంస్థ ఆధ్వర్యంలో, కావలికి చెందిన మేఘన స్టార్ హాస్పిటల్ వారి సౌజన్యంతో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ సి.విజయ భాస్కరరావు విద్యార్థినులకు చెవి, ముక్కు, గొంతుకు సంబంధించిన సమస్యలు రాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మొబైల్ ఎండోస్కోపీ యూనిట్ ద్వారా సుమారు 250 మంది విద్యార్థినులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అంద జేశారు. ఈ కార్యక్రమంలో కావలి నియోజకవర్గ యంగ్ ప్రొఫెషనల్ మరియు పీ4 కోఆర్డినేటర్ గుండెమడుగుల సత్యానందం, హాస్టల్ వార్డెన్లు విజయలక్ష్మి, నాగేశ్వరి, సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యంగ్ ప్రొఫెషనల్ సత్యానందం మాట్లాడుతూ పీ4 స్ఫూర్తితో నిరుపేద విద్యార్థినులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ముందుకు వచ్చిన డాక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

డాక్టర్ సి.విజయ భాస్కరరావు మాట్లాడుతూ విద్యార్థినులు చెవి, ముక్కు, గొంతు సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఒకవేళ ఎవరికైనా సమస్యలు ఉంటే స్టూడెంట్ ఐడీ కార్డు తీసుకుని తనను సంప్రదిస్తే రాయితీతో మెరుగైన వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యన్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానసందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎక్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్కు 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699

# హోం మంత్రి ఇలాకాలోనూ భద్రత బలహీనమే

## - పాయకరావుపేటలో మైనర్‌పై దారుణం - నెల రోజులు నిర్బంధించి అత్యాచారం - హోం శాఖ పర్యవేక్షణ ఎక్కడ? - నిందితుడిని రహస్యంగా రిమాండ్‌కు పంపడం వెనక ఉన్న ఉద్దేశ్యం ఏమిటి?



**కాకినాడ రూరల్, (రాజధాని వార్తలు):** రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ప్రాతినిధ్యం వహిస్తున్న పాయకరావుపేట నియోజకవర్గంలోనే మైనర్ బాలికపై జరిగిన లైంగిక దాడి రాష్ట్రంలో మహిళల భద్రత ఏ స్థాయిలో ఉందో చూపిస్తున్నదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగ ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి తీవ్రంగా స్పందించారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ "మహిళా హోం మంత్రిగా అనిత ప్రచార హంగులకు మాత్రమే పరిమితమైపోయారు. రాష్ట్ర శాంతిభద్రతల పర్యవేక్షణపై ఆమెకు కనీస అవగాహన ఉందా?" అని ప్రశ్నించారు. తన సొంత నియోజక వర్గంలోనే ఒక మైనర్ బాలికను నెల రోజుల పాటు నిర్బంధించి, అత్యాచారం చేసి, వీడియోలు తీసిన దారుణం తనను కలిచివేసిందని పేర్కొన్నారు.

**పోలీసుల వ్యవహారంపై తీవ్ర అభ్యంతరం**

ఈ కేసులో పోలీసులు తీసుకున్న వైఖరి ఆశ్చర్యానికి గురి చేస్తోందని నాగమణి విమర్శించారు. "నిందితుడిని రహస్యంగా అరెస్టు చేసి, మీడియాకు ఎలాంటి వివరాలు ఇవ్వకుండా రిమాండ్‌కు పంపడమేంటి? దేన్నో దాచిపెట్టే ప్రయత్నం జరుగుతోందా?" అని ఆమె ప్రశ్నించారు.

**కూటమి పాలనలో లైంగిక దాడులు పెరిగిపోయాయి**

రాష్ట్రంలో తరచూ ఆడబిడ్డలపై లైంగిక దాడులు జరుగుతున్నాయని, కానీ ప్రభుత్వం, పోలీసులు స్పందించే తీరు అత్యంత నిర్లక్ష్యంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. తుని నియోజకవర్గంలో జరిగిన మరో అత్యాచార కేసులో నిందిత వృద్ధుడు మరుసటి రోజే చెరువులో మృతదేహంగా తేలిన ఘటనను, అలాగే మదనపల్లిలో జరిగిన మరో కేసును ఆమె గుర్తు చేశారు.

**వసతి గృహాల్లో నాసిరకం ఆహారం - మంత్రి లోకేష్‌పై విమర్శలు**

ప్రభుత్వ బాలికల వసతి గృహాల్లో పాడైపోయిన ఆహారాన్ని ఇచ్చే పరిస్థితి తారా స్థాయికి దిగజారిందని అన్నారు. "విద్యార్థినులు చెడిపోయిన ఆహారం పడేస్తున్న వీడియోలు బయటపడినా వెంటనే చర్యలు తీసుకోకుండా కమిటీల పేరుతో కాలయాపన చేయడం సిగ్గుచేటు" అని మంత్రి నారా లోకేష్‌ను ఆమె ఎద్దేవా చేశారు.

# సేవా పథంలో 47వ డివిజన్ కార్పొరేటర్

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని 47వ డివిజన్ కార్పొరేటర్ పోట్లూరి రామకృష్ణ రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకుని తన ఉదారతను చాటుకున్నారు. రాష్ట్ర మంత్రి నారాయణ ఆదేశాల మేరకు నిత్యం డివిజన్ పరిధిలో పర్యటిస్తున్న ఆయన, ముస్లిం సోదరుల పట్ల ప్రత్యేక అభిమానంతో డివిజన్‌లోని పలు మసీదులకు పండ్లను పంపిణీ చేశారు. ఇందులో భాగంగా కొరడా వీధిలోని మసీదు రెహమానియా, గిడ్డంగి వీధిలోని మసీదు ఖాన్ షా, కామాటి వీధిలోని మసీదు ఆయిషా, అగ్నిపేటలోని మసీదు అబ్దుల్ సమద్ మరియు జెండా వీధిలోని అలా మసీదులను సందర్శించి, అక్కడ ఉన్న వారికి పండ్లను అందజేశారు. ఈ పంపిణీ కార్యక్రమం ద్వారా రంజాన్ వేళ ముస్లిం సోదరులకు అండగా నిలుస్తూ, మంత్రి నారాయణ మార్గదర్శకత్వంలో డివిజన్ అభివృద్ధి మరియు సంక్షేమానికి తాము కట్టుబడి ఉన్నామని ఆయన నిరూపించారు.

# రైతుల సంక్షేమానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట



**కాజులూరు, (రాజధాని వార్తలు):** రైతులు సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నాయని కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ తెలిపారు. శుక్రవారం మండలంలోని శీల రైతు సేవ కేంద్రంనందు 2026 పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవకు సంబంధించి కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమానికి కీలకమైన నిర్ణయం తీసుకుంటూ పలు ఆర్థిక సహాయాలను రైతుల ఖాతాల్లో జమ చేశారు. పీఎం కిసాన్ పథకం 22వ విడతగా రూ.2000 మరియు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పథకం 3వ విడతగా రూ.4000 మొత్తంగా ఒక్కో రైతుకు రూ.6000 వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయడం జరిగింది. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ మాట్లాడుతూ రైతుల ఆర్థిక స్థితి మెరుగుపడటానికి ఈ పథకాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. కాజులూరు మండలంలోని అన్ని రైతు సేవ కేంద్రాల్లో సాయంత్రం 4 గంటల నుండి ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయడం జరిగిందన్నారు. కాజులూరు మండలంలోని శీల రైతు సేవ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ హాజరై రైతులతో మాట్లాడి వారికి జమ అయిన నిధుల వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా కాజులూరు మండలానికి గణనీయమైన ఆర్థిక సహాయం అందిందనీ అన్నదాత సుఖీభవ పథకం ద్వారా 8,864 మంది రైతులకు రూ.4000 చొప్పున మొత్తం రూ.3.55 కోట్లు జమ చేయబడిందనీ అదే విధంగా పీఎం కిసాన్ పథకం ద్వారా 7,730 మంది రైతులకు రూ.2000 చొప్పున మొత్తం రూ.1.55 కోట్లు జమ చేయబడిందన్నారు. ఈ రెండు పథకాల ద్వారా కలిపి కాజులూరు మండలంలోని రైతులకు మొత్తం రూ.5.10 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. ఈ ఆర్థిక సహాయం రైతులకు వ్యవసాయ కార్యకలాపాలు నిర్వహించడానికి మరియు పంటల పెట్టుబడులకు ఎంతో తోడ్పడుతుందని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఈ పథకాల పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతు సేవ కేంద్రాల్లో నిర్వహించిన కార్యక్రమంలో తహసిల్దార్ రవీంద్రనాథ్ ఠాగూర్ ఎంపీడీవో జే రాంబాబు స్థానిక సర్పంచ్ కోమలి వెంకటరమణ మండల వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు ప్రశాంత్ శ్రీనివాస్ వర్మ రైతులు, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అన్నదాత సుఖీభవ రూ. 4,000: పీఎం కిసాన్ రూ.2,000 3వ విడత రైతులకు ఆర్థిక సహాయం

**కరప, (రాజధాని వార్తలు):** కాకినాడ రూరల్, మండల కేంద్రం కరప ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలోని చంద్రన్న సమావేశ మందిరంలో శుక్రవారం "అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ పథకం" 3వ విడత ప్రారంభోత్సవం కార్యక్రమం వ్యవసాయ అధికారి ఇమ్మిడిశెట్టి సత్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ), మాజీ ఎమ్మెల్యేలు పిల్లి అనంతలక్ష్మి సత్తిబాబు, చిక్కాల రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో దేశ ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌ను రైతులతో కలిసి చూశారు. ఎమ్మెల్యే పంతం నానాజీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి రైతుకు 20,000 రూపాయలు పీఎం కిసాన్ నిధుల ద్వారా అందిస్తామని చెప్పినట్లు గుర్తు చేశారు. మొదటి విడత 7,000, రెండో విడత 7,000, మూడో విడత 6,000 రూపాయలతో మొత్తం 20,000 ఇప్పటికే ఇచ్చాం.

కూటమి ప్రభుత్వం రైతులకు నిజమైన రైతు ప్రభుత్వంగా నిరూపించుకుంది అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు అభివృద్ధికి అమలు చేస్తున్న పథకాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ప్రతి ఎకరానికి సాగు నీరు అందిస్తామని, కాలువల ఆధునీకరణ పనులు చేపట్టామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ బాబురావు, ఎంపీడీవో జే శ్రీనివాస్, కూటమి నాయకులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI No: APTEL/2015/66622, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan